



నయనానందవనం

» రోజు రోజుకూ కొత్త అందాలను దిద్దుకుంటున్న నగరవనం

10లో



పనులెట్టావున్నా.. బిల్లులు చేసేస్తాం!

జగనన్న కాలనీల్లో మెరక పనుల బిల్లులు రెడీ!

రూ. 2 కోట్ల వరకు చెల్లించేందుకు అధికారుల చర్యలు

గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన జగనన్న కాలనీల్లో మెరక పనుల బిల్లులను తాజాగా చెల్లించేందుకు అధికారులు సిద్ధమవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. గిలకలదిండి, బందరుకోట, ఉల్లింగిపాలెంలోని జగనన్న కాలనీల్లో నాడు ఇష్టారాజ్యంగా వైసీపీ నేతలు కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేశారు. మెరక పనులు సరిగా లేకపోవడంతో ఆయా కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకురాలేదు. వర్షం వస్తే మెరక చేసిన స్థలాల్లో భారీగా నీరు చేరడం నాటి నాసిరకం పనులకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో నాటి పనుల బిల్లులు సుమారు రూ.2 కోట్లు చెల్లించేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపడంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాటి పనులపై విజిలెన్స్ విచారణ జరపాలని, ఆ తర్వాతే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు

- వైసీపీ నేతల నేతృత్వంలోనే నాడు ఇష్టారాజ్యంగా పనులు
- పనులు సక్రమంగా చేయకుండా బిల్లులు ఎలా చెల్లిస్తారని కూటమి నాయకుల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో మెరక పనుల పేరుతో వైసీపీ నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఇష్టారాజ్యంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ పనులకు కూటమి ప్రభుత్వంలో బిల్లులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... గిలకలదిండిలో 18 ఎకరాల్లో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. 994 మంది లబ్ధిదారులకు 2023లో ఇళ్లస్థలాలు ఇస్తున్నట్లుగా ప్రకటించారు. ఎన్నికల ముందు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఈ లేఅవుట్‌ను మెరక చేసే బాధ్యతను పంచాయతీరాజ్ విభాగానికి అప్పగించారు. నాబార్డు నిధులు రూ.5కోట్లతో ఈ లేఅవుట్‌లో మెరక పనులను చేసేందుకు అనుమతులు ఇచ్చారు. వైసీపీ నాయకుల నేతృత్వంలో తూతూమంత్రంగా మెరక పనులు చేశారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. గిలకలదిండిలోని సర్వే నంబర్ 677లోని 30 ఎకరాల ప్రభుత్వ భూముల నుంచి బుసకను తరలించి మెరక పనులు చేయడం గమనార్హం. అప్పట్లో ఇళ్లస్థలాల మెరక పేరు చెప్పి బయటి ప్రాంతాలకు బుసకను విక్రయించడంతో గిలకలదిండి వాసులు బుసక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అప్పటి అధికార పార్టీ వారే రెండు వర్గాలుగా విడిపోయి పోలీసులకు ఫిర్యాదు చేసేవరకు వ్యవహారం నడిచింది. 994 ప్లాట్లలో ఇప్పటి వరకు ఒక్క గృహం కూడా నిర్మాణం చేయలేదు. గతంలో రొయ్యల చెరువులుగా ఉన్న భూముల్లో మెరక పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో అక్కడ ఇళ్ల నిర్మాణం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంగా లబ్ధిదారులు ముందుకులేదు. ఈ లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలను మాత్రం ఏర్పాటు చేశారు.

మూడు బ్లాక్‌లుగా విడగొట్టి మరీ..

గిలకలదిండి లేఅవుట్‌లో మెరక పనులను మూడు బ్లాకులుగా విడగొట్టి చేశారు. 1వ నంబరు బ్లాక్‌లో రూ.1.50 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించి, పూర్తిస్థాయిలో చేయకుండానే పనులు జరిగినట్టుగా చూపి రూ.1.09కోట్లకు బిల్లులు చేశారు. రెండో బ్లాక్‌లో రూ.1.90 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించి... రూ.1.64కోట్ల విలువైన పనులు జరిగినట్టుగా ఎంబుక్‌లో రికార్డు చేశారు. మూడో బ్లాక్‌లో రూ.1.28 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించి రూ.1.13 కోట్ల మేర పనులు జరిగినట్టుగా చూపారు. ఇంతమేర పనులు జరిగినట్టుగా చూపినా గత వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే ఈ లేఅవుట్‌లో నీరు నిలబడింది.



గిలకలదిండి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల దుస్థితి

ఉల్లింగిపాలెం, బందరుకోట లేఅవుట్లలో..

మచిలీపట్నం నగరంలోని ఉల్లింగిపాలెంలో ఒకటో నంబరు బ్లాక్‌లో రూ.1.30 కోట్ల అంచనాలతో జగనన్న లేఫుట్ మెరక పనులను ప్రారంభించారు. ఇక్కడ రూ.20 లక్షల మేర మాత్రమే పనులు జరిగినట్టుగా ఎంబుక్‌లో రికార్డు చేశారు. రెండో నంబరు బ్లాక్‌లో రూ.1.51 కోట్ల అంచనాలతో పనులు చేపట్టారు. ఇక్కడ రూ.18.53 లక్షల విలువైన పనులు జరిగినట్టుగా చూపారు. బందరు కోటలోని లేఅవుట్‌లో రూ.65 లక్షల మిగతా 8లో..

బెట్టింగ్‌ల బుకింగ్

అవనిగడ్డ కేంద్రంగా జిల్లాలో బెట్టింగ్‌లు

టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించిన బెట్టింగ్ మూలాల్లో ఉన్న పీపీ ఎవరు? వైసీపీ నేత కుమారుడు పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోగానే ఆ పీపీ పారిపోయాడా? కృష్ణాజిల్లాలో బెట్టింగ్ నిర్వహణ కోసం సదరు పీపీనే వలను అల్లాడా? ఈ వల అవనిగడ్డ, పెడన మధ్య ఉందా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి.

పటమట స్థావరంలోనూ జోరుగా..

- పెడనకు చెందిన పీపీ కీలక పాత్రధారి
- అనుచర బుకీగా వైసీపీ నేత కుమారుడు
- పవన్‌తో పాటు మరో నలుగురి అరెస్టు
- ముందస్తు సమాచారంతో పరారైన 'పీపీ'
- నిందితుల ఖాతాల్లో రూ.48 లక్షల నిల్వ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పటమటలో బెట్టింగ్ నిర్వహిస్తున్న అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్ కుమార్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడితో పాటు పెడనకు చెందిన కోట నాగేశ్వరరావు, కృష్ణలంకకు చెందిన ఉమామహేశ్వరరావు, అవనిగడ్డకు చెందిన చెన్నా గోపయ్యస్వామి, కమ్మిలి వెంకటరమణను అరెస్టు చేసి శనివారం పటమట పోలీసులకు అప్పగించారు. మొత్తం వారి ఖాతాల్లో రూ.48 లక్షలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పవన్‌కుమార్ ఖాతాలోనే రూ.43 లక్షల వరకు ఉన్నట్టు నిర్ధారించారు.

ప్రత్యేకంగా జాయింట్ అకౌంట్

పవన్‌కుమార్, ప్రసాద్‌లు బెట్టింగ్‌లో నగదు లావాదేవీల కోసం ప్రత్యేకంగా ఓ జాయింట్ అకౌంట్ నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌లో ప్లంటర్లు ఎంతెంత మొత్తంలో బెట్టింగ్ పెట్టారు, ఎంత మొత్తంలో పందెం గెలిచిన వారికి ఇచ్చారు.. అనే వివరాల్లో పారదర్శకత కోసం మిగతా 8లో..

పీపీ అంటే..

పవన్‌కుమార్ ఫోన్‌ను పోలీసులు విశ్లేషించినప్పుడు అందులో పీపీ పేరుతో ఓ నెంబర్ ఉంది. దాని పూర్తి వివరాలు తీయగా, పెడనకు చెందిన ప్రసాద్ అనే యువకుడి నెంబరుగా గుర్తించారు. పవన్‌కుమార్‌ను వెంటబెట్టుకుని వెళ్లిన పోలీసులు అవనిగడ్డలో జరుగుతున్న బెట్టింగ్ డెన్‌ను గుర్తించారు. పెడనకు చెందిన ఈ ప్రసాద్ అవనిగడ్డలో ఇళ్ల అద్దెకు తీసుకుని బెట్టింగ్ బాగోతాన్ని నిర్వహిస్తున్నాడు. అవనిగడ్డ, చల్లపల్లి, పెడన, రేపల్లె, హైదరాబాద్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రసాద్ ప్రధాన బుకీగా వ్యవహరిస్తుండగా, పవన్‌కుమార్ ద్వితీయశ్రేణి బుకీ. ప్రసాద్ అవనిగడ్డలోని ఓ భవనం మొదటి, రెండు అంతస్తులను, పెంట్‌హౌస్‌ను అద్దెకు తీసుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇక్కడ అద్దెలు తక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడని తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అద్దె చెల్లిస్తున్నాడు. ప్రసాద్, పవన్‌కుమార్‌లు.. పార్కర్ ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా ఒక్కో మ్యాచ్‌పై 100 నుంచి 200 మందితో బెట్టింగ్ కట్టిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కాగా, పెడనకు చెందిన కోట నాగేశ్వరరావు పెనమలూరులో ఎమ్మెల్యే కార్యాలయం వీధిలో అద్దెకు ఉంటున్నాడు. పవన్‌కుమార్ ద్వారా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని పెడనకు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్ అక్కడి నుంచి పరారయ్యాడు. అవనిగడ్డకు చెందిన గోపయ్యస్వామి తక్కువ మొత్తంలో బెట్టింగ్‌లు కట్టిస్తున్నాడని తేలింది. వెంకటరమణ, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావులు ప్రసాద్, పవన్‌కుమార్‌కు కలెక్షన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

వారసత్వ సంపదగా కూచిపూడి

10లో

• కలెక్టర్ బాలాజీ

విజయ పాల ధర పెంపు!

7 కేటగిరీల్లో లీటర్‌కు రూ. 2 చొప్పున వడ్డన

- హోమోజినైజ్డ్ ఫుల్ క్రీమ్ మిల్క్ మాత్రం రూ.4 పెంపు
- ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి కొత్త ధరలు
- కృష్ణామిల్క్ యూనియన్ నిర్ణయం!

చిట్టినగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విజయ పాల ధరను పెంచుతూ కృష్ణామిల్క్ యూనియన్(విజయా డెయిరీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. విజయ డెయిరీ 7 కేటగిరీల్లో పాలను ఉత్పత్తి చేస్తోంది. గోల్డ్ పాల ధర ప్రస్తుతం లీటరు రూ.74 ఉండగా తాజాగా పెరిగిన ధరతో రూ.76 కానుంది. ఫుల్ క్రీమ్ లీటరు రూ.72 నుంచి 74, స్టాండర్డ్ రూ.62 నుంచి 64, టోన్డ్ పాల ధర రూ.58 నుంచి 60, డబుల్ టోన్డ్ రూ.54 నుంచి 56 పెంచారు. అలాగే హోమోజినైజ్డ్ ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు రూ.68 నుంచి 72, టీ మేట్ రూ.68 నుంచి 70 పెరగనుంది. ఆవుపాలు లీటరు రూ.54 నుంచి 56, టోన్డ్ మిల్క్ పెరుగు ప్యాకెట్(450 గ్రాములు) రూ.32 నుంచి 33, టోన్డ్ మిల్క్ పెరుగు ప్యాకెట్ (900గ్రాములు) రూ.62 నుంచి 64 పెంచారు. దేశంలోని అన్ని యూనియన్‌లు ధరలను పెంచాయని, పాల ఉత్పత్తి తగ్గడం, పౌండర్, బటర్ ధరలు పెరగటంతో ధరలు పెంచకతప్పలేదని యాజమాన్యం చెబుతోంది. పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయి. నెలవారీ పాలకార్డు కొనుగోలు చేసిన వారికి ఏప్రిల్ 8 వరకు పాత ధరలే వర్తిస్తాయని తెలిసింది.

ఇఫ్తార్ విందు



మచిలీపట్నం టౌన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.5,450 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు, పెడన, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, డీఆర్‌వో కె.చంద్రశేఖర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రబ్బానీ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-24 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 04-44 (సోమవారం ఉదయం)

పనులెట్టావున్నా.. బిల్లులు చేసేస్తాం!

(7వ పేజీ తరువాయి)

అంచనాలతో పనులు ప్రారంభించారు. రూ.53 లక్షల విలువైన పనులు జరిగినట్టుగా ఎంబుక్‌లో రికార్డు చేశారు. ఈ లేఅవుట్లలో వైసీపీ నాయకులు పనులు చేసినా వేరే వ్యక్తుల పేర్లు కాంట్రాక్టర్లుగా చూపడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఈ బిల్లులు కొద్దికాలంగా నిలిచిపోయాయి. ఈ లేఅవుట్‌లకు సమీపంలోని కరగ్రహారం లేఅవుట్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచా రణ జరిగింది. కానీ గిలకలదిండి, బందరు కోట, ఉల్లింగిపాలెంలలో లేఅవుట్‌లలో మెరకపనులపై విచారణ చేసి, నిజాలు నిగ్గుతేల్చాలని కూటమి నాయకులు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో అధికారులు ఈ మూడు లేఅవుట్‌లకు సంబంధించి బిల్లులను చేసి ప్రభుత్వానికి పంపారు మెరక పనులు పూర్తిస్థాయిలో చేయకున్నా అప్పటి వైసీపీ నాయకుల ఒత్తిడితో పంచాయతీరాజ్ అధికారులు బిల్లులు చేశారని, ఈ అంశంపై విచారణ జరిపిన తర్వాత బిల్లులు మంజూరు చేయాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

బెట్టింగ్‌ల బుకింగ్

(7వ పేజీ తరువాయి)

ఈ అకౌంట్‌ను నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఆన్‌లైన్‌లో డబ్బు పంపే వారికి ఈ అకౌంట్ నెంబరును ఇచ్చారు. కలెక్షన్ ఏజెంట్లుగా ఉన్న వెంకటరమణ, నాగేశ్వరరావు, ఉమా మహేశ్వరరావులు వసూలు చేసిన డబ్బును పవన్‌కుమార్ ఇస్తారు. అతడు ఆ డబ్బును జాయింట్ అకౌంట్లో జమ చేస్తాడు. టీస్టాళ్లు, కిళ్లీకొట్లు, కాఫీ కేఫ్‌లను వారు కలెక్షన్ పాయింట్లుగా పెట్టుకున్నారు. డబ్బు ఇవ్వాల్సిన వ్యక్తి వాహనం నెంబరు, ఇవ్వాల్సిన మొత్తం ప్రసాద్, పవన్‌కుమార్ కలెక్షన్ ఏజెంట్లకు చెబుతారు. వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి చెప్పిన నెంబరు కలిగిన వాహనం రాగానే డబ్బు వసూలు చేసుకోవాలి. వైసీపీ ఐదేళ్లకాలంలో పీపీ, పవన్‌కుమార్‌లు తమకు ఎదురు లేకుండా బెట్టింగ్‌లు నిర్వహించారు. పోలీసులకు చిక్కడానికి ముందు పవన్‌కుమార్ రూ.32 లక్షలను ఓ వ్యక్తికి బదిలీ చేశాడు. బెట్టింగ్‌లో అవతలి వ్యక్తి గెలవడంతో ఆ డబ్బు పంపినట్టు సమాచారం.

ప్రకృతి సేద్యంతో భూసారాన్ని కాపాడాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యంతో భూసారాన్ని కాపాడలని బాపులపాడు ఎంపీపీ వై.నగేష్ తెలిపారు. శనివారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో ప్రకృతిసేద్యంపై మండల స్థాయిలో ఏవో జె.భవాని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవదాయ ధర్మదాయ శాఖ

కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలంలో, వేంచేసియున్న శ్రీ స్వామి వార్ల దేవస్థానమునకు సంబంధించిన సర్వ హక్కుభుక్తములు కలిగియున్న ఈ క్రింది సూచించిన పట్టిక ప్రకారం మాగాణి భూముల నగదు కౌలు టెండర్-కం-బహిరంగ వేలం పాటలు మూడు సంవత్సరముల కాలపరిమితి అనగా 2025 – 2026 సం. లగాయతు, 2027-2028 వరకు ఆయా దేవస్థానముల ఆవరణలో ది. 09.04.2025, ది. 10.04.2025 మరియు ది. 11.04.2025 తేదీలలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. నెం	దేవస్థానం పేరు	గ్రామము	భూమి వివరము	సర్వే నెం.	విస్తీర్ణము	ధరావతు య 1కి	వేలం పాట జరుగు స్థలము	వేలం పాట జరుగు తేది
1	శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం	సాయిపురం	మాగాణి	24, 161/1, 94/3, 95/3	21.90	2,000/-	శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం	ది. 09/04/25 ఉదయం 10.00 గంటలకు
2	శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానం	సాయిపురం	మాగాణి	25	11.90	2,000/-	శ్రీ రామేశ్వర స్వామి వారి	ది. 09/04/25 మధ్యాహ్నం 12.00 గంటలకు
3	శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం	కలవ పాముల	మాగాణి	410, 168/2, 140/1	14.21	2,000/-	శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం	ది.10/04/25 ఉదయం 10.00 గంటలకు
4	శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం	కాటూరు	మాగాణి	462, 204	14.02	2,000/-	శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం	ది.10/04/25 మధ్యాహ్నం 12.00 గంటలకు
5	శ్రీ వేణు గోపాల స్వామి వారి దేవస్థానం	కాటూరు	మాగాణి	203, 476	6.23	2,000/-	శ్రీ వేణు గోపాల స్వామి వారి దేవస్థానం	ది.10/04/25 మధ్యాహ్నం 2.00 గంటలకు
6	శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానం	బోళ్ళపాడు	మాగాణి	489,26/9, 499,53/1	11.33	2,000/-	శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానం	ది. 10/04/25 సాయంత్రం 4.00 గంటలకు
7	శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానం	చిన్న ఓగిరాల	మాగాణి	20/1, 26/1	4.06	2,000/-	శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానం	ది.11/04/25 ఉదయం 10.00 గంటలకు
8	శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం	చిన్న ఓగిరాల	మాగాణి	35, 46	5.82	2,000/-	శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం	ది.11/04/25 మధ్యాహ్నం 12.00 గంటలకు

షరతులు : 1. ఈ వేలం పాటహిందూ దేవాదాయ ధర్మదాయ శాఖా ఉన్నతాధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిచే జరుపబడును. 2. పాటలో పాల్గొనదలచిన ప్రతి పాటదారుడు ముందుగా పైన తెలియపరచిన షెడ్యూల్ ప్రకారము ధరావతు మొత్తము చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. హెచ్చుపాటదారు పాటపాడిన వెంటనే హెచ్చు పాట మొత్తం సాయంత్రం గం.05.00 ల లోపు కట్టనిచో అతని పాటను రద్దుచేసి, ధరావతు ఫర్ఫిట్ చేసి మరల తిరిగి పాటపెట్టు అధికారం దేవస్థానం వారికి కలదు.మిగతా 2 సం.లు ఏప్రిల్10వ తేది లోపు కట్టే నిర్ణయం . ఆ విధంగా కట్టనిచో ఏవిధమైననోటీసుతో నిమిత్తం లేకుండా సదురు భూమిని పాట పెట్టు అధికారం దేవస్థానం వారికి కలదు. కౌలు భూమిని మధ్యకాలంలో వదిలివేసినచో ధరావతు వాపసు యివ్వబడదు. 4. దేవస్థానం భూమిలో చెరుకు పంట సాగు చేసినచో ఎకరం 1కి 12 టన్నులు చొప్పున శ్రీ స్వామివారి పేరున కె.సి.పి.ఉయ్యూరు వారికి సప్లయి చేయు నిర్ణయం. 5. మిగతా పాట షరతులు ఇతర వివరములు కార్యాలయ పని వేళలలో తెలుసుకోగలరు / పాటకాలమందు తెలియచేయబడును.

సాయిపురం
తేది 28-03-2025

కార్యనిర్వహణాధికారి
సెల్: 9866335737, 9701335070





పోరంకి మునిసిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన బోడె ప్రసాద్.. గన్నవరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

తెలుగుజాతి ఆత్మగౌరవం తెలుగుదేశం పార్టీ

ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు

పెనమలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ఆత్మ గౌరవం తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఉద్ఘాటించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 1982లో తెలుగుజాతి ఆత్మగౌరవం పేరుతో అన్న ఎన్టీఆర్ ప్రారంభించిన పార్టీ ఎన్నో ఆటుపోట్లలను ఎదుర్కొని తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ప్రపంచపటంలో తెలుగుజాతికి ఒక స్థానాన్ని కల్పించిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులదేనన్నారు. ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ కిశోరం లోకేశ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి ఎన్నో ఏళ్లుగా నిస్వార్థంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను సత్కరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భావం

గన్నవరం : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని గన్నవరం టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, మేడేపల్లి రమ, గూడవల్లి నరసయ్య, ఆళ్ల గోపాలకృష్ణ, కొల్లా ఆనంద్, జాస్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలో మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణరావు, జాస్తి విజయభూషణ్‌కుమార్, ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్ పాల్గొన్నారు.

●టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ప్రముఖ న్యాయవాది కేవీ రమణ, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, చిక్కవరపు నాగమణి, మండవ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మూలకొట్టు సెంటర్, తారకరామ నగర్ జంక్షన్ పట్టణ కార్యాలయంలో టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం మండల అధ్యక్షుడు



ఉయ్యూరులో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

దయాల రాజేశ్వరరావు, నాయకులు వీరమా చనేని సత్యప్రసాద్, వీరమాచనేని బుజ్జి, గార్లపాటి రాజేశ్వర రావు,వడ్డిల్లి లక్ష్మీ,మేడేపూడి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రగతి..ప్రజా సంక్షేమం..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీతోనే ప్రగతి, ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, లంక సురేంద్ర మోహనబెనర్జీ తదితరులు అన్నారు. బాపులపాడు మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన టీడీపీ 43 వసంతాల పండుగను సందర్భంగా గ్రామాల్లో పసుపు జెండా రెపరెప లాడింది. వీరవల్లి, రంగన్నగూడెం, కోడూరుపాడు, కొత్తపల్లి, వేలేరు, కాకులపాడు, రంగయ్య ప్పారావుపేట, మల్లవల్లి, బొమ్ములూరులో టీడీపీ జెండాలను ఎగురవేశారు.

పేదరికంలేని సమాజమే ధ్యేయంగా..

ఉయ్యూరు : టీడీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఉయ్యూరు, మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆకునూరులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావుతో కలసి శంకు స్థాపన చేశారు. వల్లభనేని సత్యనారాయణ, కాకాని శ్రీనివాస రావు, ఫణి, సాయి, అజ్మతుల్లా, తెలుగుయువత జిల్లా అధ్యక్షు డు దండమూడి చౌదరి పాల్గొన్నారు.

కంకిపాడు : సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ల అంటూ ఉన్నత సిద్ధాంతాలతో పుట్టుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులను సత్కరించారు. ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, యలమంచిలి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపులిపాక గ్రామంలో పేకాడుతున్న ఎనిమిది మందిని ఎస్‌ఐ ఫిరోజ్ నేతృత్వంలో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, 7300 నగదును స్వాధీనం చేసుకొన్నారు. పోలీసుల స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందేల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

1న కళాశాల ప్రాంగణ ఎంపికలు

ఉయ్యూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, విజయవాడకు చెందిన స్పీకింగ్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఉద్యోగ ఎంపిక నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు, చివరి సంవత్సరం డిగ్రీ చదువుతున్న వారు ఇంగ్లీషు భాషపై పట్టు అవగాహన, మాట్లాడగలిగే వారు ప్రాంగణ ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9701463015 సెల్‌నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

పెనమలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల గ్రామానికి చెందిన కలుగూరి వీరయ్య పటమట హైస్కూల్ రోడ్డులో ప్లాస్టిక్ వ్యాపారం చేసి జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం తన మోటారు సైకిల్‌పై పటమట వైపు వెళుతుండగా వెనుక నుంచి మరో మోటారుసైకిల్ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కంకిపాడు, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

నేటి నుంచి వసంత నవరాత్రులు

గన్నవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమతున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అర్చన, లలిత సహస్రనామ పారాయణం, హను మాన్‌చాలీసా జరుగుతుందన్నారు. ఏప్రిల్ 6న వసంతోత్సవంతో కార్యక్రమం ముగింపు జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్,మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై అవగాహనతో కూడిన జాగ్రత్త ప్రతి ఒక్కరికీ అవసరమని కేసీపీ జీఎం వి.వి. పున్నారావు సూచించారు. రంగన్నగూడెంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కెసీపీ షుగర్స్ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 152 మందికి పరీక్షలు నిర్వహించారు.

●ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



పెనమలూరు దళితవాడలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, నాయకులు,కార్యకర్తలు

ఇళ్ల పన్నులు తగ్గించాలని జనసేన నిరాహార దీక్ష

హనుమాన్‌జంక్షన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు లో ఇబ్బడిముబ్బడిగా ప్రజలపై వేసిన ఇళ్ల పన్ను భారాన్ని తగ్గించా లని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జనసేన ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామ పంచాయతీ 2016లో వేసిన ఇళ్ల పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షా శిబిరం లో టీడీపీ నాయకులు వేగుంట రామారావు, వడ్డిల్లి లక్ష్మీ మద్దతుగా పాల్గొన్నారు. శిబిరంలో జనసేన నాయకులు వడ్డి నాగేశరావు, అహమ్మద్, సింగవరపు సూర్యవతి, నల్లి రామరాజు, భార్గవ్, వీరవినాయక్, రెడ్డి లత, సుదర్శనరావు, తోట రాము పాల్గొన్నారు.



నిరసన దీక్షలో జనసేన నాయకులు

యువత వ్యవసాయ రంగం వైపు అడుగులు వేయాలి

ఉంగుటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యవసాయరంగం వైపు అడుగులు వేయాలని, వ్యవసాయ ఆధారిత ఆహార అనుబంధ ఉత్ప త్తులు తయారుచేసే పరిశ్రమలు నెలకొల్పటంద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని విజ్ఞాన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (గుంటూరు) డైరెక్టర్ తాతినేని రమేష్‌బాబు అన్నారు. ఎలీప్ ఇండియా వారి సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ)ఆధ్వర్యంలో మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో వ్యవసాయ అనుబంధ విభాగాల్లో పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు గత 45రోజులుగా నిర్వహిస్తున్న అగ్రిక్లినిక్స్ అండ్ అగ్రిబిజినెస్‌పై శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు ముఖ్య అతిథి చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలీప్ ఇండియా సంస్థ నోడల్ ఆఫీసర్ శోభారాణి, కోఆర్డినేటర్ షైనేని నళిని పాల్గొన్నారు.



ధ్రువీకరణపత్రాలు అందుకున్న విద్యార్థులతో విజ్ఞాన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ రమేష్‌బాబు

పేదలకు అండ సీఎంఆర్ఎఫ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ పథకం అత్యవసరంలో అండగా నిలబడుతోందని టీడీపీ అధ్యక్షుడు వేగే కృష్ణారావు, దోనె అశోక్ అన్నారు. బొమ్ములూరు, రంగయ్యప్పారావుపేట గ్రామాలకు చెందిన ఇద్దరికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. రంగయ్యప్పా రావుపేటకు చెందిన తోట బుల్లయ్యకు రూ. 80వేల చెక్కును అధ్యక్షుడు దోనే అశోక్, లింగం శ్రీధర్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు అందజేశారు. బొమ్ములూరుకు చెందిన కలపాల బాలరాజు కుటుం బానికి రూ. 87,619 చెక్కును అధ్యక్షుడు వేగే కృష్ణారావు, కొల్లి చందు, గండేపూడి నితీష్‌కుమార్ తదితరులు అందజేశారు.

పాడి రైతుల శ్రేయస్సే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యం

గన్నవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు కృషి చేస్తున్నారని దావాజీగూడెం పాల కేంద్రం అధ్యక్షుడు గొంది నరేంద్ర అన్నారు. దావాజీగూడెం పాలకేంద్రంలో పలు గ్రామాల అధ్యక్షులతో కలిసి శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వేగె సాంబశివరావు, కన్నెపాటి రంగారావు, కంభంపాటి కోటేశ్వరరావు, ఆత్కూరు కొండలరావు, కె.అప్పారావు, గోళ్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	147, 156, 167
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460	

పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు

ఉయ్యూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో ఆస్తి ఖాళీస్థలాలు, నీటి పన్నులు చెల్లించేందుకు ఆది, సోమవారాలు (రెండు రోజుల పాటు) కార్యాలయం లో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు నగర పంచాయతీ కమిషనర్ పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌంటర్లు పనిచేస్తాయని పట్టణ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న విజయవాడ 5వ అదనపు న్యాయాధికారి అన్నపూర్ణశ్రీ


నున్నలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిసున్న న్యాయమూర్తి సత్యానంద్

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయాధికారులు అన్నపూర్ణశ్రీ, ఏ సత్యానంద్

కంకిపాడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణ కోసం ఏర్పాటైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయవాడ 5వ అదనపు జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ అన్నారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయ మూర్తి అన్నపూర్ణశ్రీ మాట్లాడారు. పోక్సో యాక్ట్ చట్టంపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు ఏ విధంగా స్పందించాలి, ఏ విధంగా ఎదుర్కొనాలన్న దానిపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కె. శివయ్య, సీహెచ్ సుబ్బారావు, కంకిపాడు ఎఎస్సై అనీల్, హెచ్‌ఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విజయవాడ రూరల్ మండల న్యాయాధికారి ఏ సత్యానంద్ సూచించారు. నున్నలోని పంచాయతీ కార్యాలయం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్రమానికి సత్యానంద్ ముఖ్యతిథిగా హాజరై ఫోక్సోతో పాటుగా వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే సెషన్ కోర్టు జడ్జి శ్రీదేవి, ప్యానల్ న్యాయవాదులు రాము, రామకృష్ణ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అవసరం


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్

ఉంగుటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక నైపుణ్యాలతో కూడిన సాంకేతిక పరిజ్ఞానం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో అవసరమని తేలప్రోలు ఉషారామా కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో ఈసీఈ విభాగం ఫైనలియర్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్య ప్రదర్శన నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించిన కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య, కళాశాల డీన్ ఆఫ్ అకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, కోఆర్డినేటర్లు ఎం.వీ.శ్రీకాంత్, యు.కే.కిషోర్, ఎ.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో స్వయంగా వడ్డిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

పెనమలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. శనివారం కానూరు సనత్‌నగర్‌లో టీడీపీ కృష్ణా జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, యువ నేత రెహమాన్‌లు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెలగపూడి శంకరబాబు, సమీర్, అనుమోలు ప్రభాకర రావు, తాతపూడి గణేష్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నయనానందవనం

రోజు రోజుకూ కొత్త అందాలను దిద్దుకుంటున్న మూలపాడు నగరవనం


దొంగమర్ల బావి

చూపు తిప్పుకోలేని అభయారణ్యం! ఎంత చూసినా తనివి తీరని రిజర్వు ఫారెస్ట్ సోయగం! సరికొత్తగా ముస్తాబవుతున్న బటర్‌ఫ్లై పార్కు, వెదురు వనం, దొంగమర్ల బావి, ఓల్డ్ గెస్ట్ హౌస్, జలపాతాలు.. ఉరుకుల పరుగుల జీవితంతో తీరిక లేకుండా గడిపే విజయవాడ నగర, ఎన్టీఆర్ జిల్లా గ్రామీణ ప్రాంత వాసులకు వీకెండ్స్‌లో కాస్త సేద తీరేందుకు ఆహ్వానిస్తోంది. రోజురోజుకూ మరింత అందంగా తయారవుతూ పచ్చని చెట్ల పందిళ్ల మధ్య పర్యాటకులను పరవశింపజేసేందుకు రెడీ అవుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడకు అతిసమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ సమీపంలోని మూలపాడు నగరవనాన్ని ఒక్కసారైనా సందర్శించాల్సిందే! కొండపల్లి అభయారణ్యపు అందాలను రెండు కళ్లతో ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనిపిస్తుంది. సహజ ప్రకృతి అందాలు, గలగలా పారే సహజసిద్ధ జలపాతాల సోయగాలు, వెదురు వనం, నేరేడు వనం, పార్కు.. ఇలా లోపలికి వెళ్లిన కొద్దీ అనేక ఆకర్షణలు దర్శనమిస్తాయి.

- ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి

- దొంగమర్ల బావి, ఆంజనేయస్వామి ఆలయం, గెస్ట్ హౌస్, జలపాతాలు ..
- చూపు తిప్పుకోలేని అందం సీతాకోకచిలుకల పార్క్ సొంతం
- అడుగడుగునా పచ్చని చెట్లు - అబ్బురపరిచే వెదురు, జామాయిల్ వనం
- అంతరించిపోతున్న ఔషధ మొక్కలతో ప్రత్యేక వనక్షేత్రాలు

మూలపాడు నగరవనంలో సీతాకోక చిలుకల పార్కు కొత్త అందాలను సంతరించుకోవడంతో ఈ ప్రాంతానికి మరింత క్రేజ్ పెరుగుతోంది. నయనానందంతో పాటు మనస్సుకు ఉల్లాసాన్ని అందించే అనేక ప్రదేశాలు ఈ పార్కులో ఉన్నాయి. ప్రధానద్వారం వద్దే సీతాకోక చిలుకల రంగురంగుల బొమ్మలు ఆకట్టుకుంటాయి. లోనికి ప్రవేశించిన తర్వాత దారి పొడవునా సిమెంట్ బల్లలపై సీతాకోక చిలుకల బొమ్మలు ఏర్పాటు చేశారు. పిల్లలకు ప్రత్యేకంగా ఆటస్థలాలను అందుబాటులో ఉంచారు. పాతకాలం చుట్టి గుడిసెలను, చెక్కకుర్చీలను ప్రత్యేక ఆకర్షణలుగా రూపొందించారు. నేరేడు తోట, విప్ప, వెలగ, మారేడు, ఉసిరి, వేప మొదలైన అనేక రకాల చెట్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

అబ్బురపరిచే వెదురు వనం


ఇక్కడున్న అన్ని ఆకర్షణల్లో వెదురువనం ప్రత్యేకం. మధ్యలో జామాయిల్ చెట్ల పొదరింటిలా ఏర్పాటైన ఈ వనం సహజసిద్ధ అందంతో అబ్బురపరుస్తుంది. గతంలో అనేక సినిమా షూటింగ్స్ జరిగాయి.

అభయారణ్యం అందాలు

కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ఎంతో అందమైందే కాదు దట్టమైంది కూడా. అనేక ఔషధ మొక్కలు, తెల్లపొనికి మొక్కలు, భారీ వృక్షాలు సమూహం దీని ప్రత్యేకత. మూలపాడు నగరవనం మెయిన్ గేటు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో దొంగమర్ల బావి ఉంది. పక్కనే భక్తుల కోరిన కోర్కెలు నెరవేర్చే అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. కొండపైకి వెళ్లేందుకు మోటార్ బైక్ రోడ్డు కూడా ఉంది. ప్రస్తుతానికి పాడైన ఓల్డ్ గెస్ట్ హౌస్ మరమ్మతులకు అటవీ శాఖ ప్రయత్నిస్తోంది. దొంగమర్ల బావి నుంచి పడమర వైపు 2 కిలోమీటర్ల దూరంలో మరో జలపాతం కనువిందు చేస్తుంది.

ఎండని బావి - సహజ జలపాతాలు

దొంగమర్ల బావిలో ఎప్పుడూ నీరుంటుంది. ఎండాకాలంలోనూ ఎండిపోదు. ఈ బావిపై అనేక జలపాతాలున్నాయి. వర్షాకాలం నుంచి వేసవి ప్రారంభం వరకు నీరు పారుతూనే ఉంటుంది.


చుట్టిగుడిసె

ఆదివారాలు, పండుగల రద్దీ

సీతాకోక చిలుకల పార్కు, దొంగమర్ల బావి వద్దకు ఆదివారాలు, పండుగలు, సెలవు రోజుల్లో పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఎంట్రన్స్ ఫీజు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ20, మిగిలిన రోజుల్లో ఒక్కొక్కరికీ రూ.100 చెల్లించాలి.


వెదురు వనం

భద్రతా చర్యలు

సీతాకోక చిలుకల పార్కు వరకు వెళ్లడం సురక్షితం. కానీ దొంగమర్ల బావి వద్దకు సమూహంగా వెళ్లడం ఉత్తమం. అక్కడ సెల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉండదు. ఒంటరిగా వెళ్లడం శ్రేయస్కరం కాదు.

ఎలా చేరుకోవాలి?

నగరవనం విజయవాడకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా మూలపాడు చేరుకుని అక్కడి నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లోకి వెళ్లాలి. ఆటోలు, బైకులు అందుబాటులో ఉంటాయి.

ప్రస్తుతం జరుగుతున్న పనులు

నగరవనం మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు రెండు వైపులా సైడ్ డ్రెయిన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్లాంటేషన్ మధ్యలో సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. నక్షత్రవనం, రాశి వనంతో పాటు మొత్తం 8 రకాల వనాలు ఏర్పాటు చేస్తున్నారు. కడియం నుంచి గోల్డెన్ బాంబూస్, పొగడ, ఇతర పూల మొక్కలు నాటుతున్నారు. లుక్కింగ్ స్పాట్ నుంచి చూస్తే ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు చుట్టూ కొండల మధ్య అందంగా కనిస్తుంది.


కడియం నుంచి తెచ్చిన మొక్కలు





అక్టోబరుకు పూర్తి స్థాయిలో గ్రీనరీ: డీఆర్‌వో శివప్రసాద్

నర్సరీ ద్వారా పెంచే వేప, నేరేడు, మారేడు, ఉసిరి, వెదురు, గోల్డెన్ తురంత, కుంకిడి, వెల్లమర్తి కాక కడియం నర్సరీ నుంచి పలు రకాల మొక్కలు తెచ్చి నాటుతున్నాం. సైక్లింగ్ కోసం ఇక్కడ ట్రాక్‌తో పాటు 6 సైకిళ్లు ఏర్పాటు చేశారు. ఉన్నవాటితో పాటు మరో బోరు వేసి గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నాం. వేసవిలో చెట్లు ఎండిపోకుండా చర్యలు చేపట్టాం. వచ్చే అక్టోబరు నాటికి నగరవనంలో పూర్తిస్థాయి గ్రీనరీ ఉండేలా చూస్తాం.

జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎంపీ ఉగాది శుభాకాంక్షలు

కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసమే బలంగా విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లా ప్రగతిని విశ్వవినువీధులకు చాటేలా అధికారులు చేయాలని, పేదరిక నిర్మూలనకు ఈ ఉగాది నాంది పలకాలని కోరుతూ జిల్లా ప్రజలకు కలెక్టర్ లక్ష్మీశ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదరిక నిర్మూలన కోసం అమలు చేసుతన్న పీ4 పథకం దిగ్విజయంగా కొనసాగేందుకు ఈ ఉగాది నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల కోసం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా అధికారులు నూతన శక్తితో బాధ్యతలు నిర్వహించాలని కోరుకుంటూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఉద్యోగులకు, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ శివనాథ్ శుభాకాంక్షలు

వన్‌టౌన్: ఉగాది నాడు తినే షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని వివిధ అనుభవాలను సూచిస్తుందని తెలుగు సంవత్సరాదికి, నూతన జీవితానికి నాందిగా ఉగాది పండగ జరుపుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఈద్ నమాజ్ పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు బహిరంగ ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహిస్తున్నట్టు ముస్లిం ఈద్గా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ తెలిపారు. శనివారం స్టేడియంలో ఈద్ నమాజ్ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ రోజు ఉదయం 7.15 గంటలకు ఈద్ సందేశం ప్రారంభమవుతుందని, నమాజ్ ఉదయం 8గంటలకు జరుగుతుందన్నారు. వజూ కోసం శుభ్రమైన నీరు అందుబాటులో ఉంటుందని, నమాజు నిర్వహించుకునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదరులు ఈద్ నమాజ్‌లో పాల్గొనాలని కోరారు. ఈద్గా కమిటీ సభ్యులు ఎండీ అన్వర్ పాష, ఎండీ ఇర్ఫాన్, షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా ఏపీ

- సీఎం చంద్రబాబును కలిసిన హోటల్స్ అసోసియేషన్ సభ్యులు

గుణదల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏపీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంలో తాము పాత్రధారులవుతామని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఆలిండియా హోటల్స్ అసోసియేషన్ నుంచి కొంతమంది సభ్యులంతా గత రెండు రోజులుగా గుణదల్లోని హోటల్ హయత్ ప్లేస్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకుని ఏపీలో పెట్టుబడులు పెట్టే విషయమై చర్చించుకున్నామన్నారు. ఆయా అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి 45 నిమిషాల పాటు మాట్లాడామన్నారు. రాష్ట్రంలో హోటళ్లు, రెస్టారెంట్ల ఏర్పాటుకు పెట్టుబడి పెట్టేవారిని తీసుకురావాలని కోరారన్నారు. ఆలిండియా హోటల్స్ అసోసియేషన్‌లోని ముఖ్యులతో సలహామండలి ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారన్నారు. దీనిపై తాము హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బ్రాండెడ్ హోటల్స్ ఇన్వెస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారని, టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే పాలసీ ఇచ్చిందని, పెట్టుబడిదారులు ముందుకొస్తే వారికి కావాల్సిన సహాయం అందిస్తామని సీఎం స్వయంగా చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. చిత్తూరు, శ్రీశైలంలో పర్యాటకాభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అక్కడ భూములు కేటాయిస్తామని స్టార్ హోటళ్లు నిర్మించాలని చంద్రబాబు కోరారన్నారు. ఆ దిశగా తాము ఆలోచన చేస్తామని సీఎంకు హామీ ఇచ్చామన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని త్వరలోనే ప్రారంభించబోతున్నామన్నారు. తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ నేతలు వెంకటరెడ్డి, తమిళనాడు హోటల్స్ అసోసియేషన్ నేతలు సుబ్బు, జీయార్టీ హోటల్స్ చైర్మన్ నటరాజన్, తాజ్ సెలెక్షన్స్ హోటల్స్ ప్రతినిధి బాలకృష్ణ, హోటల్ రంగ ప్రముఖులు సోమరాజు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి మాట్లాడుతున్న హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు


కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

హయ్యర్ పెన్షన్ ఆప్షన్లను తిరస్కరించటం ఆపాలి

- కేంద్ర మంత్రి పెమ్మసానికి కార్మిక పరిషత్ వినతి

బస్‌స్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల ఈపీఎఫ్‌వో హయ్యర్ పెన్షన్ ఆప్షన్లను తిరస్కరించటాన్ని ఆపాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆర్టీసీ కార్మికపరిషత్ రాష్ట్ర కమిటీ శనివారం వినతి పత్రం అందజేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే ఆప్షన్లను అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకే ఆన్‌లైన్ జాయింట్ ఆప్షన్‌ను సబ్‌మిట్ చేశారని, దీంతో పాటు డిమాండ్ లేఖలు కూడా వచ్చాయన్నారు. కొద్దిరోజులుగా ఏ కారణం లేకుండానే జాయింట్ ఆప్షన్స్‌ను తిరస్కరిస్తున్నారన్నారు. ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శివకుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సుప్రీం కోర్టు ఇచ్చిన సదవకాశాన్ని అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన వారిలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సీసీఎస్ ఎంసీ మెంబర్ కె.సురేంద్ర, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. రాజేష్, విజయవాడ డిపో కార్యదర్శి ఎస్.ప్రభాకర్ ఉన్నారు. కేంద్ర కార్మిక మంత్రితో మాట్లాడి అందరికీ డిమాండ్ లేఖలు జారీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

రైళ్లలో దోపిడీ చేసే దొంగలు అరెస్టు

రైల్వే స్టేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ రైల్వే పోలీసు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ప్రయాణికులకు మత్తు మందు ఇచ్చి దోపిడీ చేసే ముగ్గురు దొంగలను శనివారం అరెస్టు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1లో దక్షిణం వైపు చివరన దొంగలను గుర్తించి పట్టుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన సుశీల్ మండల్ (32) అశోక్ మండల్ (46) దుర్గజ్ మండల్ (39)ను అరెస్టు చేశారు. వీరిపై ఈ ఏడాది ఫిబ్రవరి 15న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన దొంగతనం, అదే నెల 18న తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్‌లో సింహాచలం రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన దొంగతనాల్లో కేసులు నమోదు అయ్యాయి. వారి నుంచి ప్రయాణికులకు మత్తు కల్పించేందుకు వినియోగించిన 21 ట్యాబ్లెట్లను, 5 గ్రాముల బరువున్న రెండు బంగారు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

విద్యాధరపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమైనట్టు శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. టీచర్స్ కాలనీలో ఉంటున్న పంచపర్వాల దొంతువేశ్వరరావు (50), రాజ్యలక్ష్మి దంపతుల మధ్య మనస్పర్థలు రావటంతో సుమారు 15 ఏళ్ల క్రితం విడిపోయారు. తరువాత నుంచి అతడు లాయర్ పుప్పాల దివ్యలక్ష్మితో కలిసి సహజీవనం చేస్తున్నాడు. 6 నెలల నుంచి మద్యం సేవించి దివ్యలక్ష్మిని వేధిస్తున్నాడు. దీంతో ఆమె ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లింది. 24న ఉదయం పిట్టల సాంబశివరావు అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి జయదుర్గా లారీ ఆఫీసు వద్ద ఈనెల 15న రాత్రి దొంతువేశ్వరరావు తన ఫోన్, మోటార్ సైకిల్ పెట్టి ఎక్కడికో వెళ్లాడని, అప్పటి నుంచి రాలేదని చెప్పాడు. ఆమె హైదరాబాద్ నుంచి వచ్చి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో మైలవరంలో ఉంటున్న తొత్తడి సత్య వెంకట దుర్గ శివ నగేష్ 8 నెలల నుంచి గొల్లపూడి మహాత్మాగాంధీ కాంప్లెక్స్‌లోని 217 షాపులో శ్రీ నగేష్ ఫార్మాస్యూటికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వివాహం కాలేదు. హైదరాబాద్ సమీపంలోని సంగారెడ్డిలో ఉంటున్న అతడి సోదరి లోవకుమారి తరచూ తమ్ముడితో మాట్లాడుతూనే ఉంటుంది. ఈ క్రమంలో ఈనెల 28న ఉదయం తమ్ముడితో మాట్లాడింది. మధ్యాహ్నం నగేష్ షాపులో పనిచేస్తున్న ఝాన్సీ లోవకుమారికి ఫోన్‌చేసి నగేష్ షాపులో లేడని చెప్పింది. దీంతో లోవకుమారి తమ్ముడికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో భర్త శరత్ కుమార్‌ను గొల్లపూడి షాపు వద్దకు పంపింది. ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె హైదరాబాద్ నుంచి వచ్చి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పైగా ఓ లెటర్ షాపులో లభించింది. నా గురించి వెతకవద్దు. నాకు మంచి జాబ్ వచ్చింది. సెటిల్ అయిన తరువాత వస్తా అని పేర్కొన్నాడు. అతడు తన బైక్‌పై వెళుతూ బట్టల బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయాడని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.


అదృశ్యమైన దొంతువేశ్వరరావు, వెంకట దుర్గ శివ నగేష్

వివాహితను బెదిరించిన నలుగురిపై కేసు

వివాహితను చంపుతానని బెదిరించిన నలుగురిపై శనివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం యద్దనపూడి వారి వీధిలో ఉంటున్న సాలపు నౌహీరాబాను 2002లో వినయబాల మురళీకృష్ణను ప్రేమ వివాహం చేసుకుంది. అతడి కుటుంబ సభ్యుల అంగీకారం లేకపోవటంతో విడిగా ఉంటున్నారు. ఒక కుమార్తె. 2019 ఏప్రిల్ 14న మురళీ కృష్ణ అనారోగ్యంతో మృతిచెందాడు. నాటి నుంచి మురళీకృష్ణ తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు నౌహీరాబానును వేధిస్తున్నారు. ఆమె ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుమార్తెను చదివించుకుంటుంది. భర్త తరఫున రావాల్సిన ఆస్తులను ఇవ్వమని కోరగా నిరాకరించి బెదిరిస్తున్నారు. పెద్దల సమక్షంలో మాట్లాడినప్పటికీ పట్టించుకోవటం లేదు. పైగా బాధితురాలికి ఆస్తిలో ఎలాంటి హక్కులేదని సంతకాలు పెట్టమని బలవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 7న ఆమెకు ఫోన్ చేసి కాగితాలపై సంతకాలు పెట్టకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద 60కేజీల గంజాయి పట్టివేత

ఉంగుటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు నిందితులను శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 28న సాయంత్రం ఉంగుటూరు మండలం, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఏలూరు వైపు నుంచి విజయవాడ వైపు అనుమానాస్పదంగా వస్తున్న ఎర్టిగా కారును ఆపి తనిఖీచేయగా అందులో 3 బస్తాల్లో ప్యాకింగ్ చేసిన 60కేజీల గంజాయి పట్టుబడింది. కారులో ప్రయాణిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శివారు సివిడిమామిడికి చెందిన దలాయి చంటిబాబు, కర్నాటక రాష్ట్రం, బీదర్‌జిల్లా, జంగి గ్రామానికి చెందిన సంతోష్, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన మూడావత్ భాస్కర్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక ఎర్టిగా కారు, మూడు స్మార్ట్ సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్కూరు ఎస్సై చావా సురేష్, సిబ్బంది ఈ.పవన్, కుమార్, ఆంజనేయులు, రామారావు, మోహనరావు ఎస్పీ అభినందించారు.

వారసత్వ సంపదగా కూచిపూడి: కలెక్టర్

కూచిపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిని రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపదగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని శ్రీ సిద్దేంద్ర కళాపీఠం సమావేశ మందిరంలో జేసీ గీతాంజలి శర్మ, ప్రభుత్వ శాఖల అధికారులతో కూచిపూడి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. తొలుత కలెక్టర్, జేసీ సిద్దేంద్రయోగి, నటరాజస్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కూచిపూడి సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించినట్టు తెలిపారు. కూచిపూడి అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై కళాకారులు, గ్రామస్థుల అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. కూచిపూడి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వివిధ దశల్లో సాధించిన అభివృద్ధిని వివరించేలా ఒక చిత్ర ప్రదర్శనను, మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. కూచిపూడి అభివృద్ధి చెందాలంటే ఒక థియేటర్, ఒక మ్యూజియంతోపాటు పూర్తిస్థాయి విశ్వవిద్యాలయం ఏర్పడాలన్నారు. కూచిపూడి నాట్యంపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వివరించారు. కూచిపూడి నాట్యంలో ఉపయోగించే దుస్తులు, కాలిగజ్జెలు, జడలు తదితర సామగ్రి ఇక్కడే తయారు చేసే నైపుణ్యం అందించి ఇక్కడి నుంచి విదేశాలకు పంపితే గ్రామం ఆర్థికంగా బలోపేతమవుతుందన్న అంశంపై కలెక్టర్ స్పందిస్తూ డీఆర్‌డీఏ పీడీ హరనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి మహిళలకు దుస్తులు, జడలు, గజ్జెల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామంలో రహదారులు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖర్‌రావు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు వై.వి.ప్రసన్న, సహాయ సంచాలకుడు లజ్వంత్ నాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డీపీవో అరుణ, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, నాట్యాచార్యులు వేదాంతం వెంకట నాగ చలపతి, చింతా రవి బాలకృష్ణ, వేదాంతం రాధేశ్యామ్, తహసీల్దార్ మస్తాన్, ఈవోపీఆర్‌డీ పరమాత్మ పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ పాల్గొన్న జేసీ అధికారులు

ఎన్టీఆర్ జిల్లాను అగ్రభాగంలో నిలుపుదాం

- జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్



జిల్లా అభివృద్ధిపై వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, విప్ తంగిరాల సౌమ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలో సముద్ర తీరం తప్ప అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అనుకూలమైన అన్ని వనరులు ఉన్నాయి. అధికారులంతా సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేస్తే తలసరి ఆదాయంలో ఇప్పుడున్న మూడో స్థానం నుంచి అగ్రస్థానంలో జిల్లాను నిలపొచ్చు.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కొండపల్లి ఖిల్లాపై శనివారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు సాయం అందుతోందన్నారు. రూ.27 వేల కోట్ల రైల్వేలైన్ పనులు, రూ.3 లక్షల కోట్లతో హైవే రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. 2047 వరకు ఏటా 15 శాతం వృద్ధి రేటు టార్గెట్‌గా పెట్టుకోవాలని అందుకు ప్రతి అధికారి పూర్తి సహకారం అందించాలని కోరారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖిల్లాపై జైలును పర్యాటక ప్రాంతంగా మార్చాలి

కొండపల్లి ఖిల్లాపై జైలును అండమాన్ జైలులా పర్యాటక ప్రాంతంలా మార్చాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. కొండపల్లి కోటకు వచ్చే అప్రోచ్ రోడ్డు దిగువ భాగంలో బూడిద లారీలు తిరుగుతున్నందున దాన్ని ఎన్టీటీపీఎస్ అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. సూర్యఘర్ పథకానికి 80 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని 1,000 మందే ఇన్‌స్టాలేషన్ చేసుకున్నారని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంఎఫ్‌బీవైపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 1.4 లక్షల మంది రైతులుంటే 3,187 మందికే బీమా ప్రీమియం చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. పలుచోట్ల ఆర్వోబీలు, ఆర్‌యూబీలపై రైల్వే అధికారులు, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం ఉందని దాన్ని సరి చేసుకోవాలని సూచించారు.

టూరిజం హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దుతాం: కలెక్టర్ లక్ష్మీశ

జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు చూసేలా టూరిజం ప్యాక్‌ను తయారు చేస్తున్నామన్నారు. విజయవాడలో ఇప్పుడున్న ఫుడ్ కోర్టుతో పాటు మరో మూడు చోట్ల ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సితార సెంటర్‌లో రూ.2 కోట్లతో ఒకదాని పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద, బెంజ్ సర్కిల్ వద్ద ఫుడ్ కోర్టులు పెడతామన్నారు. గత ప్రభుత్వ హయంలో జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో 230 ఎకరాలను వీఎంసీ లబ్ధిదారులకు నివేశన స్థలాలుగా ఇచ్చేందుకు కేటాయిస్తే అక్కడకు ఎవ్వరూ వెళ్లలేదని, అది నిరుపయోగంగా ఉందని దాన్ని పారిశ్రామిక హబ్‌గా మారుస్తామని అన్నారు.

ప్రజా సమస్యల కంటే వైసీపీకి రాజకీయమే ముఖ్యమా

ఏపీఐసీసీ కాలనీలో 488 కుటుంబాలు ఉంటున్నాయి. 2,500 మంది నివాసం ఉంటున్నారు. వారికి మంచినీరు ఇచ్చే పనులకు కౌన్సిల్‌లో బలం ఉందని వైసీపీ వాళ్లు అడ్డుపడ్డారు. దాన్ని ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. ప్రజా సమస్యల కంటే వైసీపీకి రాజకీయమే ముఖ్యమా? ఇప్పటికే మంత్రి నారాయణతో, ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడా. ఈవేసవిలో ఆ కాలనీకి మంచినీరు అందించేలా చూడాలి. కోతులు పట్టే వారిని పంపిస్తే నా సొంత నిధులుస్తా. గుణదల మేరీమాత ఆలయానికి వచ్చే భక్తుల కోసం బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు బస్సులు అధిక సంఖ్యలో తిప్పాలి. రాణిగారితోట వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున అక్కడ సబ్‌వేల నిర్మాణంలో అధికారులు చొరవ తీసుకోవాలి. మొగల్రాజుపురంలో సీఎస్‌ఐ స్కూల్‌ను తక్షణం తెరిపించాలి. - ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

టిడ్కో ఇళ్ల వ్యవహారం త్వరగా తేల్చాలి

టిడ్కో ఇళ్ల వ్యవహారాన్ని త్వరగా తేల్చాలి. ప్రభుత్వమే లబ్ధిదారులు వడ్డీని భరించాలి. జక్కంపూడిలో పేదలకు నివేశనా స్థలాల ఇవ్వాలి. అంబేద్కర్ స్మృతి వనం వద్ద రైతుబజారు ఏర్పాటు చేయాలి.

- ఎమ్మెల్యే బొండా ఉమా

అనాసాగరం ఎన్‌హెచ్ బాధితులకు న్యాయం చేయాలి

అనాసాగరం ఎన్‌హెచ్ కింద భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి. నందిగామ ప్రభుత్వాస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచడం సంతోషంగా ఉంది.

- ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

రైతుల్ని ఆదుకోవాలి

మునేరు, పాలేరు వరదల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి. గండ్లు పూడ్చాలి. ఎకరంలో మేట వేసిన ఇసుకను తొలగించేందుకు లక్షల్లో ఖర్చవుతోంది. దాన్ని వేరే అవసరాలకు మళ్లిస్తే ఆదాయంతో పాటు ప్రభుత్వానికి ఖర్చు కలిసి వస్తుంది. జగ్గయ్యపేట నగరవనం (వేదాద్రి), ముక్త్యాల అతిథిగృహాన్ని వినియోగంలోకి తేవాలి. బోట్ షికారును అభివృద్ధి చేయాలి. జగ్గయ్యపేటలో 586 ఎకరాల సీలింగ్ ల్యాండ్ సమస్యను పరిష్కరించాలి. - ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

రామచంద్రాపురం వద్ద రహదారి సమస్య పరిష్కరించాలి

ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద రహదారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. ప్రభుత్వ పనులకు గ్రావెల్ దొరకని పరిస్థితి ఉంది. గ్రావెల్ సమస్యకు పరిష్కారం చూపాలి. ఎ.కొండూరుకు త్వరితగతిన మంచినీరు అందేలా చూడాలి.

-ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



శాంతినగర్ - కవులూరు గ్రామాల మధ్య వినియోగంలోకి రాని కొత్త వంతెన



కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య అసంపూర్తిగా మిగిలిపోయిన హైలెవల్ వంతెన

ఇంకెన్నాళ్లు!

బీడీసీపై 2014-19 మధ్య వంతెనల నిర్మాణం ప్రారంభం

- ఇప్పటికీ అసంపూర్తిగానే వంతెనలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రెండు చోట్ల శిథిలావస్థలో ఉన్న వంతెనలే దిక్కు
- అవీ ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి
- ఐదేళ్లలో అప్రోచ్ రోడ్లు వేయలేకపోయిన వైసీపీ
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని వేడుకోలు



కవులూరు - కట్టుబడిపాలెం వద్ద అప్రోచ్ రోడ్డు లేని హైలెవల్ వంతెన

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి: బుడమేరు డైవర్షన్ చానెల్ (బీడీసీ)పై మూడు చోట్ల వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకా ఎన్నాళ్లు అవస్థలు పడాలని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.22 కోట్లతో శాంతినగర్-కవులూరు, కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య శిథిలావస్థల్లో ఉన్న వంతెనల పక్కన, కవులూరు-కట్టుబడిపాలెం మధ్య పాత వంతెన స్థానంలో హైలెవెల్ వంతెనలు నిర్మించారు. కవులూరు-కట్టుబడిపాలెం వద్ద తాత్కాలిక అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి దాన్ని ఉపయోగంలోకి తెచ్చారు. మిగిలిన రెండు చోట్ల ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయలేదు. అక్కడ ఉన్న పాత వంతెనలపైనే ఇప్పటికీ రాకపోకలు సాగిస్తున్నారు. బీడీసీకి గండ్లు పడినప్పుడు కవులూరు-శాంతినగర్ వంతెనకు తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు పోశారు. ఇక కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య ఉన్న హైలెవల్ వంతెనకు ఇప్పటికీ చెవి కట్లు కట్టలేదు. ఆ ప్రదేశంలో ముళ్లపొదలు మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి అసంపూర్తిగా ఉన్న హైలెవల్ వంతెనలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



కొండపల్లి-ఈలప్రోలు పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. కొత్త వంతెనను అందుబాటులోకి తేవాలి. అసంపూర్తి పనులు పూర్తి చేయాలి. రైతులందరికీ ఎంతో ఉపయోకరమైన వంతెన ఇది. సత్వరమే పనులు ప్రారంభించి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలి.

- వల్లూరి కిషోర్ కుమార్, ఈలప్రోలు

గత ప్రభుత్వం పనులు ఆపేసింది



నిత్యం పనుల నిమిత్తం ఈలప్రోలు నుంచి కొండపల్లికి రైతులు, సాధారణ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాత వంతెన పడిపోయే వరకు పట్టించుకోరా? గత ప్రభుత్వం పూర్తిగా పనులు ఆపేసింది. ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. త్వరగా వంతెన అసంపూర్తి పనులు పూర్తి చేయాలి.

- దారపనేని సాంబశివరావు, ఈలప్రోలు

అంచనాలు సిద్ధం చేశాం

వంతెనల అప్రోచ్ రోడ్లలకు పోలవరం కట్టలపై మట్టి వాడుకునే అవకాశం లేదు. కోర్టులో వ్యవహారం ఉన్నందున బయట మట్టితోనే అప్రోచ్ రోడ్లు వేయాలి. ఇందుకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

-కౌశిక్, బీడీసీ జేఈ

బోర్డర్ దాటుతున్న ఇసుక

- తిరువూరు మీదుగా తెలంగాణకు రోజుకు 15 నుంచి 20 టిప్పర్లలో తరలింపు



తిరువూరు బైపాస్ రోడ్డులో నిలిపి ఉంచిన ఇసుక టిప్పర్లు

(తిరువూరు-ఆంధ్రజ్యోతి): తిరువూరు మీదుగా తెలంగాణ ప్రాంతానికి యథేచ్ఛగా రోజుకు 15 నుంచి 20 టిప్పర్లు ఇసుకను అనధికారికంగా తరలించుకుపోతున్నాయి. అయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కంచికచర్ల, నందిగామ ఇసుక రీచ్‌ల నుంచి టిప్పరుకు 40 టన్నుల ఇసుక లోడు చేసుకుని ఉదయానికి ఎ.కొండూరు ప్రాంతంలోని ఖాళీ స్థలంలో కొన్ని, తిరువూరు బైపాస్‌రోడ్డులోని స్థలంలోకి కొన్ని చేరుకుంటాయి. తిరువూరు ప్రాంతంలో ఈ టిప్పర్లను నిర్వహించే వ్యక్తి తెలంగాణలో ఇసుక ఎవరికి అవసరమో తెలుసుకుని, సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుని వస్తాడని, సాయంత్రానికి కొందరు వ్యక్తులు ఖాకీ దుస్తులు ధరించి, ప్రైవేటు వాహనంలో బోర్డర్ వద్ద రెక్కీ నిర్వహించి, ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక టిప్పర్ల వద్ద ఉండే వ్యక్తికి సమాచారం అందిస్తారని, తర్వాతే ఈ టిప్పర్లు బోర్డర్ దాటి తెలంగాణలోకి వెళుతుంటాయని కొందరు చెబుతున్నారు. ఆంధ్ర ప్రాంత టాక్సీ ప్లేటు వాహనాలు తెలంగాణలోకి ప్రవేశించేందుకు టెంపరరీ పర్మిట్ తీసుకోవాలి. కానీ, ఈ టిప్పర్లకు అనుమతులు లేకుండానే నేరుగా బోర్డర్ దాటుతున్నాయి. పట్టణ శివారులోని ఆంధ్ర-తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బంది లేకపోవడం, గతంలో బైపాస్‌రోడ్డులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు తొలగించడంతో, అనధికార రవాణాకు అడ్డంకి లేకుండా పోతోంది. కొన్నిసార్లు పగలే ఇసుక టిప్పర్లు తెలంగాణ ప్రాంతానికి తరలి వెళుతున్నాయి.

అనధికార రవాణా చేస్తే పీడీ యాక్టు పెడతాం

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రవాణాదారులపై పీడీ యాక్టు పెడతాం. ఇప్పటి వరకు 7 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నాం. బోర్డర్ వద్ద ప్రత్యేక నిఘా పెడతాం.

-కేవీజీవీ సత్యనారాయణ, పట్టణం సెక్టార్-1 ఎస్సై

దేవదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా షణ్ముగం

విజయవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా నటరాజ షణ్ముగం నియమితులయ్యారు. ప్రస్తుతం వన్‌టౌన్‌లోని పాత శివాలయం ఈవోగా పనిచేస్తున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. తొలుత సీవీ రెడ్డి ట్రస్ట్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న నూతక్కి సాంబశివరావును నియమించారు. ఈయన దేవదాయశాఖ కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సీతారామయ్య అనారోగ్యం కారణంగా సెలవులో వెళ్లారు. ముందుగా సాంబశివరావును ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ ఆ ఉత్తర్వులను శనివారం నిలుపుదల చేశారు. ఆ స్థానంలో నటరాజ షణ్ముగానికి బాధ్యతలు అప్పగించారు.

రూ.10 కోట్లతో కలెక్టరేట్‌లో సమావేశ మందిరం



కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో రూ.10 కోట్ల అంచనాలతో సమావేశ మందిరాన్ని నిర్మిస్తామనని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరం నిర్మించే ప్రాంతాన్ని ఎంపిక చేసేందుకు కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఆయన కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. 200 ఏళ్ల క్రితం బ్రిటీష్ పాలకులు కలెక్టరేట్‌ను మచిలీపట్నంలో నిర్మించారని అన్నారు. కలెక్టరేట్‌లో వివిధసమావేశాలు నిర్వహించాలంటే సమావేశపు మందిరం సరిపోవడం లేదన్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో కలెక్టరేట్‌లో అత్యంత అధునాతనమైన సమావేశపు మందిరాన్ని నిర్మించాలని ఆలోచన చేస్తున్నామని ఎంపీ బాలశౌరి తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

లింగగూడెంలో క్షుద్రపూజలు

- భీమవరం రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో బొమ్మలు గీసి, పసుపు కుంకుమ చల్లి, రాళ్లుపెట్టిన ఆగంతకులు
- తరచూ గ్రామంలో క్షుద్రపూజలు చేస్తున్నారంటున్న గ్రామస్థులు
- పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు, కూలీలు



లింగగూడెంలోని భీమవరం రోడ్డులో ఆగంతకులు వదిలి వెళ్లిన పసుపు, కుంకుమ ఇతర వస్తువులు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట), మార్చి 29(ఆంధ్రజ్యోతి): పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామస్థులు క్షుద్రపూజల భయంతో వణికి పోతున్నారు. కొద్ది రోజులగా భీమవరం రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో పూజలు చేస్తున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అమావాస్య కావటంతో మంత్రగాళ్లు పూజలు చేశారని పలువురు చెబుతున్నారు. రెండు బొమ్మలు గీసి, పసుపు కుంకుమలు చల్లి, రాళ్లు పెట్టి ఉన్నాయి. రాత్రి మొక్కజొన్న చేలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతులను చూసి ఆగంతకులు కారులో భీమవరం రోడ్డులోకి పరారయ్యారని చెబుతున్నారు. అర్ధరాత్రి 2-3 గంటల మధ్య ఇటీవల కాలంలో అమావాస్య తిథుల్లో పూజలు చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఆ రోడ్డులోకి వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల పెనుగంచిప్రోలు మండలంలో అన్ని గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఆగంతకుల సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తరచూ గ్రామంలోని పెనుగంచిప్రోలు రోడ్డులో గండెవాగు వద్ద, లింగగూడెం బస్టాప్ వద్ద రోడ్డులో కోళ్లు కోయటం, కోడిగుడ్లు వదలటం, కుంకుమ ముద్దలు వేయటం చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. పెనుగంచిప్రోలు ఎస్సై అశ్విన్‌ను వివరణ కోరగా ఈ సంఘటన కొద్దిరోజుల క్రితం జరిగిందని తెలుస్తోందని పూర్తి విచారణ చేస్తామని తెలిపారు.

బెట్టింగ్‌ల బుకింగ్

(7వ పేజీ తరువాయి)

ఈ అకౌంట్‌ను నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఆన్‌లైన్‌లో డబ్బు పంపే వారికి ఈ అకౌంట్ నెంబరును ఇచ్చారు. కలెక్షన్ ఏజెంట్లుగా ఉన్న వెంకటరమణ, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావులు వసూలు చేసిన డబ్బును పవన్‌కుమార్‌కు ఇస్తారు. అతడు ఆ డబ్బును జాయింట్ అకౌంట్లో జమ చేస్తాడు. టీస్టాళ్లు, కిళ్లీకొట్లు, కాఫీ కేఫ్‌లను వారు కలెక్షన్ పాయింట్లుగా పెట్టుకున్నారు. డబ్బు ఇవ్వాల్సిన వ్యక్తి వాహనం నెంబరు, ఇవ్వాల్సిన మొత్తం ప్రసాద్, పవన్‌కుమార్ కలెక్షన్ ఏజెంట్లకు చెబుతారు. వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి చెప్పిన నెంబరు కలిగిన వాహనం రాగానే డబ్బు వసూలు చేసుకోవాలి. వైసీపీ ఐదేళ్లకాలంలో పీపీ, పవన్ కుమార్‌లు తమకు ఎదురు లేకుండా బెట్టింగ్‌లు నిర్వహించారు. పోలీసులకు చిక్కడానికి ముందు పవన్‌కుమార్ రూ.32 లక్షలను ఓ వ్యక్తికి బదిలీ చేశాడు. బెట్టింగ్‌లో అవతలి వ్యక్తి గెలవడంతో ఆ డబ్బు పంపినట్టు సమాచారం.

పనులెట్లావున్నా.. బిల్లులు చేసేస్తాం!

(7వ పేజీ తరువాయి)

అంచనాలతో పనులు ప్రారంభించారు. రూ.53 లక్షల విలువైన పనులు జరిగినట్టుగా ఎంబుక్‌లో రికార్డు చేశారు. ఈ లేఅవుట్లలో వైసీపీ నాయకులు పనులు చేసినా వేరే వ్యక్తుల పేర్లు కాంట్రాక్టర్లుగా చూపడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఈ బిల్లులు కొద్దికాలంగా నిలిచిపోయాయి. ఈ లేఅవుట్‌లకు సమీపంలోని కరగ్రహారం లేఅవుట్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిగింది. కానీ గిలకలదిండి, బందరుకోట, ఉల్లింగిపాలెంలలో లేఅవుట్‌లలో మెరకపనులపై విచారణ చేసి, నిజాలు నిగ్గుతేల్చాలని కూటమి నాయకులు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో అధికారులు ఈ మూడు లేఅవుట్‌లకు సంబంధించి బిల్లులను చేసి ప్రభుత్వానికి పంపారు మెరక పనులు పూర్తిస్థాయిలో చేయకున్నా అప్పటి వైసీపీ నాయకుల ఒత్తిడితో పంచాయతీరాజ్ అధికారులు బిల్లులు చేశారని, ఈ అంశంపై విచారణ జరిపిన తర్వాత బిల్లులు మంజూరు చేయాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

అక్రమాల అటెండర్

- ఆర్టీసీ హై ఎండ్ బస్సుల్లో అటెండర్ల కోసం టెండర్లు
- టెండర్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆర్టీసీ ఎండీ, ఉన్నాతాధికారులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)కి చెందిన హై ఎండ్ బస్సులలో అటెండర్ల కోసం పిలిచిన టెండర్లపై వివాదం నెలకొంది. సిండికేట్ల ప్రయోజనాల కోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. టెండర్లలో పాలు పంచుకున్న ఒక కాంట్రాక్టర్ టెండర్లు లోపభూయిష్టంగా జరిగాయని ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో కొంతమంది ఆర్టీసీ అధికారుల ప్రయోజనాలు కూడా దాగున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీ ఎన్టీఆర్ రీజియన్ పరిధిలోని విజయవాడ డిపోలో ఇటీవల హై ఎండ్ బస్సులైన అమరావతి, డాల్ఫిన్ క్రూస్, వెన్నెల స్లీపర్, ఇంద్ర బస్సుల్లో అటెండర్ల కోసం టెండర్లను పిలిచారు. మొత్తం 86 మంది అన్‌స్కిల్డ్ అటెండర్లు, 4 సెమీ స్కిల్డ్ సూపర్‌వైజర్లు, 2 స్కిల్డ్ టీవీ టెక్నీషియన్ల కోసం ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానించారు. వీరు హై ఎండ్ బస్సుల్లో ఆడియో, వీడియోలను ఆపరేట్ చేయడం, ఆర్టీసీ సరఫరా చేసే మినరల్ బాటిల్స్ చాక్లెట్లు, దుప్పట్లు, న్యూస్ పేపర్లను ఉచితంగా ప్రయాణికులకు సరఫరా చేయటంతో పాటు దీనికి సంబంధించిన ఖాతాలను నిర్వహించాలి. ప్రయాణికుల కోరిక మేరకు వారి లగేజీని బస్సులో భద్రపరచటం, బస్సు నుంచి దించటం, పాసింజర్ల లగేజీని గుర్తించటానికి ఐడెంటిఫికేషన్ కార్డులను ఉపయోగించటం, స్నాక్స్, కూల్‌డ్రింక్స్‌ను ఎంఆర్‌పీ రేటుకు విక్రయించటం, శుభ్రపరిచిన ఊలు దుప్పట్లను ప్రయాణికులకు అందించటం, వారానికి ఒకసారి ఉతికిన కర్టెన్లను బస్సులో ఏర్పాటు చేయటం, బస్సు బయలుదేరే ముందు, వచ్చిన తర్వాత సీట్లలో దుమ్మును దులిపి బాడీ, అద్దాలు, లోపల ఫ్లోరింగ్‌లను తడిగుడ్డతో తుడిచి పొడిగుడ్డతో తుడవటం, ఎయిర్‌ఫ్రెషనర్స్ ఉపయోగించటం, బస్సుల్లో డీవీడీ ఆడియో-వీడియో సిస్టమ్స్‌ను నిర్వహించటం, వాటికి రిపేర్లు వస్తే బాగు చేయించటం వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రైవేటు ఏజెన్సీ కోసం ఆర్టీసీ విజయవాడ డిపో అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లలో 49 బిడ్లు నిలిచాయి. వీటిలో 7 నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పక్కన పెట్టారు. 42 అర్హత సాధించాయి. పక్కన పెట్టిన 7లో 3 బిడ్లను మళ్లీ తీసి కలిపారు. మొత్తం 45 బిడ్లను అర్హమైనవిగా తేల్చారు.

గత వైసీపీ ప్రభుత్వం నుంచి పాతుకుపోయిన సిండికేట్

వీటిలో కిందటి వైసీపీ ప్రభుత్వం నుంచి పాతుకుపోయిన కాంట్రాక్టర్ల సిండికేట్ కూడా ఉందని తెలుస్తోంది. అదే పాత సిండికేట్‌కే టెండర్లు రావటం వివాదానికి దారితీసింది. సిండికేట్ కాంట్రాక్టర్లు వేర్వేరు పేర్లతో బహుళ టెండర్లు వేశాయని కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సిండికేట్ ప్రయోజనాలను కాపాడారని విమర్శించారు.

సమగ్ర విచారణ జరపాలి

అటెండర్ల టెండర్లలో జరిగిన లోపాలపై ఆర్టీసీ ఎండీ, విజయవాడ ఈడీ, ఆర్టీసీ ఆర్ఎం, టెండర్ కమిటీకి వై.శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. టెండర్లు పిలిచినప్పటి నుంచి కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం ఆర్టీసీ అధికారులు అనేక సవరణలు ఇచ్చారని ఆరోపించారు. తాము టెండర్ ఫారాన్ని రూ.5,900కు కొనుగోలు చేశామని, ఆ తర్వాత సిండికేట్ ప్రయోజనాల కోసం రూ.1770కు తగ్గించారన్నారు. సిండికేట్ వేర్వేరు పేర్లతో లెక్కకు మించి వేయటం వల్ల రూ.5,900 ధర ఉంటే వారిపై భారం పడుతుందని, తర్వాత తగ్గించారన్నారు. ఒకే వ్యక్తి టెండర్ ఫారం తీసుకోవాలని నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా, ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో టెండర్లు తీసుకున్నారని ఆరోపించారు. ఎక్స్‌పీరియన్స్-శాటిస్‌ఫ్యాక్టరీ సర్టిఫికెట్లు, ఈఎండీ ధర రూ.9,30,000, టర్నోవర్ రూ.కోటి, ప్రాఫిట్ మార్జిన్‌ను 7శాతంగా నిర్ణయించారని తెలిపారు. సవరణల పేరుతో ఇష్టానుసారంగా మార్పులు చేసి చెల్లుబాటు కాని టెండర్లను క్వాలిఫై చేశారన్నారు. ఏ బిడ్‌ను తీసినా కాంట్రాక్టర్ల త్రయం సిండికేట్‌లు వేయించినవే వస్తున్నాయని, సిండికేట్ త్రయం హాల్‌లో కూర్చున్న కాంట్రాక్టర్లపై చంపేస్తామంటూ తొడకొట్టి బెదిరించిం దని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియపైనా, కాంట్రాక్టర్ల సిండికేట్ త్రయం బెదిరింపులపైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	147, 156, 167
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

మెగా డీఎస్సీలో అవకాశం కల్పించాలి



డైట్ చివరి సంవత్సరం విద్యార్థులు

గుడ్లవల్లేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో తమకు కూడా అవకాశం కల్పించాలని, మరో నెలలో చివరి సంవత్సరం పరీక్షలు పూర్తి చేసుకొని బయటికి రానున్న అంగలూరు డైట్ విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రాన్ని పంపారు. ప్రస్తుత అకడమిక్ సంవత్సరం ఏప్రిల్ 23కు డిఎడ్ 2023-25 బ్యాచ్ చదువు పూర్తి చేసి బయటకు వస్తామని, ఉపాధ్యాయ వృత్తే ధ్యేయంగా చదివామని కూటమి ప్రభుత్వం నిర్వహించే మెగా డీఎస్సీలో తమకు అవకాశం కల్పించాలని కోరారు.

తెలుగుదేశంతోనే పేదలకు మేలు

టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు



గుడివాడ ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు.. మొవ్వలో..

గుడివాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అని, పేదలకు మేలు చేసేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ప్రజావేదిక వద్ద టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. మార్కెట్ సెంటర్‌లో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నాయకులు చేకూరు జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ, పిన్నమనేని బాబ్జీ, రాంబాబు, సత్యనారాయణ, పొట్లూరి కృష్ణారావు, అడుసుమిల్లి శ్రీనివాసరావు, మిక్కిలినేని రమేష్, ముళ్ళపూడి రమేష్, మజ్జాడ నాగరాజు, కంచర్ల సుధాకర్, లింగం ప్రసాద్, షేక్ ఇబ్రహీం, వసంతవాడ దుర్గారావు, వార్డు ఇన్‌చార్జులు, మాజీ కౌన్సిలర్లు, తెలుగు మహిళ, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, ఐ టిడిపి, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన టీడీపీ 43 సంవత్సరాలు అజేయంగా నిలిచిందని మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ అన్నారు. బొమ్ములూరులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు శొంఠి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గుంటా కోడూరు గ్రామంలో టీడీపీ నాయకులు అంగడాల వీర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు అంగడాల రామాంజనేయులు, అంగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. **నందివాడ :** మండల టీడీపీ అధ్యక్షుడు పార్టీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. నందివాడ, తుమ్మలపల్లిలో రాధాకృష్ణ ఆధ్వర్యంలో కుదరవల్లి మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు ఆధ్వర్యంలో, వెన్ననపూడిలో కాకరాల సురేష్, లక్ష్మీనరసింహాపురంలో దానేటి సన్యాసిరావు, పోలుకొండలో కురమ శ్రీనివాసరావు, అనుమనపూడి, తమిరిశ, జనార్ధనపురం, పుట్టగుంట, చినలింగాల, పెదలింగాల గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. బొర్రా సత్యనారాయణ, ఉప్పల వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి శ్రీనివాసరావు, మండల డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు, చినబాబు, సర్పంచ్ ఝాన్సీ కుమారి, లక్ష్మణరావు, అరవబాబు, సురేష్, గోపిచంద్, సదాదేవి, సత్యానందం, సాంబశివరావు, రంగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి కృషి చేసేది టీడీపీ మాత్రమేనని వెంకటరాఘవపురం మాజీ సర్పంచ్ కాకరాల సుభాష్ చంద్రబోస్(సురేష్) అన్నారు. వెన్ననపూడిలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. వెన్ననపూడి సర్పంచ్ అరవ బాబీ, నాయకులు సూరపనేని సురేష్, మాతంగి సదాదేవి, గోరిపర్తి స్వామి, సూరపనేని నాగేశ్వరరావు, బాబురావు, అట్లూరి మురళీ, తుమ్మల ఓంకార్, రావి సాంబశివరావు, తుమ్మల ఈశ్వరరావు, గోరిపర్తి పిచ్చయ్య, పల్లె రాముడు, బట్టు బాలస్వామి, అట్లూరి రవి, పోతుమర్తి కిషోర్, సూరపనేని బాలయ్య, సుబ్రహ్మణ్యం, గోగులపాటి గోపిచంద్, మన్నే భాస్కరావు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గుడ్లవల్లేరులో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పొట్లూరి రవికుమార్ కేక్‌కట్ చేశారు. కౌతవరంలో వి.బి.కేబి సుబ్బారావు(వల్లభనేని బాబూరావు) తూము పద్మజ కేక్ కట్ చేశారు. వల్లభనేని వెంకటరావు, చాపరాల బాలాజీ, కోలా రాధాకృష్ణ, చాపరాల రాజేశ్వరరావు, జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య, రంగబాబు, సుబ్బారావు, పోలవరపు వెంకటరావు, యెనిగళ్ళ నాగేశ్వరరావు,మురాల నరేష్, మరీదు నాగలక్ష్మి, ప్రసాద్, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, నానాజీ తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** టీడీపీఆవిర్భావ దినోత్సవాన్ని మొవ్వలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీదాస్, మండవ రత్నగిరిరావు, ఈడే నాగేశ్వరరావు, మండవ శ్రీకృష్ణ, మండవ కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వరరావు, పిచ్చేశ్వరరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు పార్టీ జెండా ఎగురవేశారు. పార్టీ కార్యదర్శి కొల్లూరి బాబ్జి, నాయకుడు లింగమునేని బాబూరావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి తిరిగి కృషిచేస్తున్నారని కొనియాడారు. డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, సర్పంచ్ ముళ్లపూడి సునీత, కార్యకర్తలు పాల్గొన్నారు. **పామర్రు:** ఎమ్మెల్యే కుమార్ రాజా పలు చోట్ల పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కోమరవోలులో మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు నేతృత్వంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ బసవతారకం దంపతుల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. నిమ్మకూరులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సర్పంచ్ పడమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లిగణేష్, అల్లంశెట్టిసురేష్ పరిశ సుబ్రమణ్యం, మంతెన రామంజనేయులు, పామర్తి విజయశేఖర్, వెంకయ్య, చాట్ల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, మోహనరావు, కందులమస్తాన్‌రావు, అల్లంశెట్టి అంజిబాబు, రాజులపాటి యశోదకృష్ణ పానుగంటి సందీప్, కోమరవోలు పార్టీ అధ్యక్షుడు పెనుమూడి లక్ష్మణరావు, కోనేరు వేణుబాబు, పోట్లూరిరాజారావు, మోటూరిసుబ్రమణ్యం, విప్రసాద్, నిమ్మకూరులో జంపాని వేంకటేశ్వరరావు, శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) ఆధ్వర్యంలో వెంట్రప్రగడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచారు. యలమర్రు, పెదపారుపూడి, మోపర్రు, దోసపాడు, భూషణగుళ్ల గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కూచిపూడి సుబ్బయ్య, గొర్రిపర్తి రవికుమార్, చిలకా ఆంజనేయులు, సబ్బా శివకుమార్, గుండమనేని శ్రీనివాసరావు (స్వామి), నీటి సంఘం అధ్యక్షులు కూచిపూడి శ్రీనివాసరావు, కాగితం లక్ష్మీనారాయణ, చలసాని నవీన్ చౌదరి, చెరుకూరి రమేష్, గారపాటి వీర నాగబాబురావు పాల్గొన్నారు.



పామర్రులో.. పమిడిముక్కల పార్టీ కారాలయం ఆవరణలో.. తోట్లవల్లూరులో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ

కృష్ణాజిల్లా , పమిడిముక్కల మండలం, మంటాదలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు సంబంధించిన ఈ క్రింది సూచించిన పట్టిక ప్రకారం దేవస్థానంలో విద్యుత్ అలంకరణ లైసెన్స్ హక్కునకు టెండర్-కం-బహిరంగ వేలంపాట ఒక సంవత్సరము కాలపరిమితి అనగా 2025-2026 సం. వరకు దేవస్థానము ఆవరణలో ది. 09.04.2025 తేదీలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం	దేవస్థానం పేరు	గ్రామము	వివరము	ధరావతు	వేలం పాట జరుగు స్థలము	వేలం పాట జరుగు తేది
1	శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి దేవస్థానం	మంటాద	దేవస్థానములో విద్యుత్ అలంకరణ లైసెన్స్ హక్కునకు	25,000/-	శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి దేవస్థానం	ది.09/04/25 సాయంత్రం 4.00 గంటలకు

షరతులు : 1. ఈ వేలం పాటహిందూ దేవాదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిచే జరుపబడును. 2. పాటలో పాల్గొనదలచిన ప్రతి పాటదారుడు ముందుగా పైన తెలియపరచిన షెడ్యూల్ ప్రకారము ధరావతు మొత్తము చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. హెచ్చుపాటదారు పాటపాడిన వెంటనే హెచ్చు పాట మొత్తం సాయంత్రం గం.05.00 ల లోపు కట్టనిచో అతని పాటను రద్దుచేసి, ధరావతు ఫర్‌ఫిట్ చేసి మరల తిరిగి పాటపెట్టు అధికారం దేవస్థానం వారికే కలదు . 4. మిగతా పాట షరతులు ఇతర వివరములు కార్యాలయ పని వేళలలో తెలుసుకోగలరు / పాటకాలమందు తెలియచేయబడును.

మంటాద, తేది 28-03-2025 — కార్యనిర్వహణాధికారి, సెల్: 9701335070

పేద ముస్లింలకు రంజాన్ తోఫా

గుడివాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పేద ముస్లింలు రంజాన్ పండుగను ఆనందంగా నిర్వహించుకోవడానికి తమ వంతు సహకారంగా రంజాన్ తోఫా అందజేస్తున్నట్లు బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) తెలిపారు. ముబారక్ సెంటర్‌లో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ, పట్టణ మాజీ అధ్యక్షులు యర్రపోతు అర్జున్, నాయకులు బోనం గోపిక, రీటా, షాలిని, లంకా రాంబాబు, గానుగుల రాజా పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై పూర్తి రాయితీ ఇవ్వాలి

గుడివాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను బకాయిలపై 100 శాతం రాయితీ యివ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను పెంపుదలకు తెచ్చిన మున్సిపల్ సవరణ చట్టం 44/2020 రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మెమోరాండం అందజేశామన్నారు. ఐద్వా ప.రజిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం

గుడివాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వీకేఆర్ అండ్ వీఎన్‌బి ఇంజినీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పూర్వ చైర్మన్, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పిన్నమనేని ఉదయభాస్కర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల పాలకవర్గ కార్యదర్శ వేములపల్లి కోదండరామయ్య పతకాలు, ట్రోఫీలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, వార్షికోత్సవ కన్వీనర్లు యం.నాగు, కొల్లిపర దుర్గప్రసాద్, ఎంబీఏ అధ్యాపకురాలు సిహెచ్ శ్రావణి, అకడమిక్ డీన్స్ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పొట్లూరి రవికుమార్‌ను అభినందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరికి సత్కారం

గుడ్లవల్లేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పొట్లూరి రవికుమార్‌ను గుడ్లవల్లేరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఉదయం సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆ పదవికి వన్నె తేగల్గిన సమర్థునికి పదవి దక్కడం ముదావహం అన్నారు. పుష్పగుచ్ఛ ఇచ్చి అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి జయరావు, ఉచ్చుల రవికుమార్, కోగంటి రాధాకృష్ణ, చాపరాల సుధాకర్, కుంచపర్తి ప్రభాకరరావు, అనిల్, జంగం సతీష్,దేవిశెట్టి రామకృష్ణ, రొయ్యల శ్యామ్యూల్ , అడుసుమిల్లి రాయల్, కొడాలి రామ్మోహన్, తుమ్మల శ్రీను,కుటుంబరావు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

గుడ్లవల్లేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్షేనని గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి. సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి గుడ్లవల్లేరులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా బైక్ రైడ్ చేసేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి పట్టుపడితే రూ.10 వేలు జరిమానా విధించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేస్తామని, ఆరు నెలల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ మార్చి నెలలో మద్యం తాగి వాహనం నడిపిన 10 మందిని కోర్టుకు అప్పగించగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున లక్ష రూపాయలు జరిమానాలు విధించారు.

ఘనంగా ఉగాది, రంజాన్ వేడుకలు

గుడివాడ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుడివాడ శ్రీ సాయి షైనింగ్ స్టార్ స్కూల్‌లో ఉగాది, రంజాన్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు.మామిడి తోరణాలు, బంతి పూల దండలతో ప్రత్యేక అలంకరణ చేసి చిన్నపిల్లలకు నూతన వస్త్రాలు ధరింపచేసి ఉగాది పచ్చడి చేయించారు. టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌కె.జబీన్, కరీముల్లా, మియాకా, మనిద్ మౌలానా తదితరుల ఆధ్వర్యంలో రంజాన్ పండుగను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం లింగమనేని స్రవంతి, లింగమనేని జగదీష్, ఉపాధ్యాయులు సర్వమతాల విశిష్టత వివరించారు.

పాడి రైతులకు వరం కృష్ణా మిల్క్ యూనియన్

పెదపారుపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు బోనస్ ప్రకటించడం పట్ల ముదునూరు బీఎంసీ పరిధిలో గల వివిధ పాల సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పునుకొల్లు రత్న ప్రసాద్, జొన్నల కోటిరెడ్డి, కృష్ణా మిల్క్ యూనియన్ ఫీడ్ కమిటీ సభ్యులు కుర్రా శివ ప్రసాద్, కోలవెన్ను సంఘ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, యలమర్రు సంఘం అధ్యక్షులు వల్లభనేని వెంకట నరసింహారావు, కడవకొల్లు సంఘం అధ్యక్షుడు దున్నల రామ్మోహన్‌రావు, బొడ్డపాడు సంఘం అధ్యక్షుడు పాలడుగు వసంత కుమార్, వేమండ సంఘ అధ్యక్షులు దుక్కిపాటి శ్రీధర్, కంకిపాడు సంఘం అధ్యక్షులు గుడివాడ వెంకట సుబ్బారావు, కాటూరు సంఘం అధ్యక్షుడు ఈడ్పుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరరావుకు పార్టీలో సముచిత స్థానం: లోకేశ్ హామీ

కూచిపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావుకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. మొవ్వ ఏఎంసీ చైర్మన్ పదవిని లింగమనేని ఆశించారు. వర్ల కుమార్ రాజా రామలింగేశ్వరరావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మొవ్వ ఏఎంసీ స్థానాన్ని బీజేపీ నుంచి కూచిపూడి గ్రామానికి చెందిన దోనేపూడి శివరామయ్యను ప్రభుత్వం నియమించింది. లింగమనేనికి పదవి దక్కక పోవటంతో మండలంలో నెలకొన్న అసంతృప్తిని గమనించిన ఎమ్మెల్యే కుమార్ రాజా లింగమనేని రామలింగేశ్వరరావును శనివారం లోకేశ్ వద్దకు తీసుకెళ్లారు. త్వరలోనే సముచిత స్థానం కల్పించి గౌరవిస్తామని, అధైర్యపడవద్దని లోకేష్ హామీ ఇచ్చారు. పార్టీ నేతలు కుదరవల్లి ప్రవీణ్, వల్లూరిపల్లి గణేష్, తాతా నారాయణరావు, వీరపనేని శివరామ్, సత్యనారాయణ ఉన్నారు.

నూరుశాతం పన్ను వసూళ్లు లక్ష్యంగా పనిచేయాలి : డీపీవో

కూచిపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి పంచాయతీలకు రావాల్సిన పన్ను బకాయిలను మార్చి 31వ తేదీ నాటికి నూరుశాతం వసూలు లక్ష్యంగా అధికారులు పని చేయాలని డీపీవో జె.అరుణ అధికారులను ఆదేశించారు. కూచిపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో మండలంలోని 21 గ్రామపంచాయతీల కార్యదర్శులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 497 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.84.65 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.61.44 కోట్లు వసూలైందన్నారు. పన్ను వసూళ్లలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి 31లోగా పూర్తి లక్ష్యాన్ని చేరుకునేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత కుమారి, ఈవోపీఆర్డీ పరమాత్మ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	147, 156, 167
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	290

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

తీరప్రాంత తాగునీటి సమస్య పరిష్కరించాలి : వేదవ్యాస్

కృత్తివెన్ను, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. శీతనపల్లిలోని మెగా రక్షిత మంచినీటి పథకం పరిధిలోని గరిశపూడి, చందాల, నిడమర్రు, పోడు, చినగొల్లపాలెం, పల్లెపాలెం, మాట్లంతో పాటు మరికొన్ని గ్రామాలకు తాగునీటి సమస్య ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం తగిన ప్రాణాళిక సిద్ధం చేయాలని, మంచి నీటి చెరువుల్లో నీటి మట్టం పరిశీలిస్తూ, అవసరమైతే ట్యాం కర్లతో నీటి సరఫరా చేయాలని వేదవ్యాస్ సూచించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

• టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నేతల ఉద్ఘాటన




బందరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల బుల్లయ్య, బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ తదితరులు, మంత్రి సతీమణి నీలిమ ఆధ్వర్యంలో సీనియర్ నేతలకు సత్కారం

మచిలీపట్నం టౌన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీరామారావు ఆశయాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ కార్యాలయంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా జరిగింది. పార్టీ జెండాను గొర్రెపాటి గోపీచంద్ ఎగుర వేశారు. మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, సీనియర్ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, పల్లపాటి సుబ్రహ్మణ్యం, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కుంచే నాని తదితరులు పాల్గొన్నారు. 150 మంది టీడీపీ కార్యకర్తలకు కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేసి కొల్లు నీలిమ సత్కరించారు. బస్టాండ్‌సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొనకళ్ల పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కానూరులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పేదలకు గోపు సత్యనారాయణ ఆర్థిక సాయం అందజేశారు. **పెడన** : నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టణ తెలుగుదేశం బొడ్డు వేణుగోపాలరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, హన్ను, పడవల వైడేశ్వరరావు, అనుముల పూర్ణ, వాసా సాంబశివరావు, అబ్దుల్ ఖదీర్, బొడ్డు ఆనందరావు, పరసా సూర్యనారాయణ, కమ్మగంటి బాబు, కర్రా మోహనరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

పెడన రూరల్ : పెడన పట్టణంతోపాటు చెన్నూరు, ఉరివి, పుల్లపాడు, నందమూరు, జింజేరి, గౌడపాలెం, కాకర్లమూడి, మడక, బల్లిపర్రు, కొంకేపూడి, నడుపూరు, కూడూరు, నందిగామ, శేరివర్తర్లపల్లి, పెనుమల్లి, కొప్పల్లి, ముచ్చర్ల గ్రామాల్లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి స్వీట్లు పంచారు. **గూడూరు** : గూడూరు గాంధీబొమ్మ సెంటర్‌లో పార్టీ జెండాను పోతన స్వామి ఆవిష్కరించారు. తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ఎన్ఏ బేగ్, జి. ఫణిరాజు, ఎలకుర్రు సూరారపు ఆంజనేయులు, బేతాళ స్వామి, తమ్మన శ్రీనివాసరావు, చిన్నం వెంకటేశ్వరరావు, నలిగిలి కిరణ్, కంభం పవన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నేతలు బొబ్బా గోవర్ధన్, మండవ బాలవర్ధిరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ క్రియాశీలక సభ్యులు విశ్వనాథపల్లి పాప, మండలి రామ్మోహనరావు, మెగావత్ గోపి తదితరులను ఘనంగా సన్మానించారు. అవనిగడ్డ కోర్టు సెంటర్‌లో యాసం చిట్టిబాబు, మైనార్టీ నేత మొగల్ మురాద్, షేక్ బాబావలిల నేతృత్వంలో జెండాను ఆవిష్కరించారు. **అవనిగడ్డ రూరల్** : మోదుమూడిలో గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి, మిఠాయిలు పంచారు. **నాగాయలంక** : నాగాయలంకలో టీడీపీ పతాకాలను టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు తదితరులు ఎగురవేశారు. నంగేగడ్డలో టీడీపీ దిమ్మె జెండాను కనపర్తి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. ప్రజలకు మిఠాయిలను పంచి పెట్టారు. **ఘంటసాల** : బ్యాంక్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి అయినపూడి భాను ప్రకాష్ నివాళులర్పించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. తాడేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్ నివాళులర్పించారు. కొడాలిలో మొవ్వ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మల జనార్ధన బాబు పతాకాన్ని ఆవిష్కరించగా, తుమ్మల శంకరరావు, వీరంకి నాగరాజు, కంఠమనేని రాజగోపాల్ పాల్గొన్నారు. గోగినేనిపాలెంలో కుంపటి సుబ్బారావు ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. శ్రీకాకుళం బస్టాండ్ సెంటర్‌లో తుమ్మల చౌదరి బాబు 25 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స చేయించుకున్న నిరుపేద మహిళకు రూ.2 వేల ఆర్థిక సాయాన్ని, నూతన వస్త్రాలను అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడుతాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దాసం రామకృష్ణ, అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు, పాల్గొన్నారు. **మోపిదేవి** : మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు ప్రధాన సెంటర్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి కనపర్తి శ్రీనివాసరావు నివాళులర్పించారు. **చల్లపల్లి** : జెండా స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, మోర్ల ప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీషోరి, రావి చిట్టి, మోర్ల శివ, పరిశె మౌళి, మట్టా అశోక్, అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్, బళ్లా వాసు, బుల్లా కిషోర్, కోట పద్మావతి, మేడికొండ విజయ్, రవిబాబు, షేక్ ఇబ్రహీం, కొక్కిలిగడ్డ ఆదాం తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీపురం, పాగోలు, మంగళాపురం, పురిటిగడ్డ, మాజేరు, యార్లగడ్డలో పార్టీ పతకాలను జెండా ఎగురవేశారు. **కోడూరు** : మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్ , విశ్వనాథపల్లి, దింటిమెరకలో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. **కృత్తివెన్ను** : టీడీపీ కార్యాలయం మండల టీడీపీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జెండాను ఆవిష్కరించి, స్వీట్స్ పంచారు. డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, నాయకులు కూనసాని చిన్న, నాగిడి చెన్నకేశవరావు, కూనసాని శ్రీనివాసరావు, యాదంరెడ్డి కొండ, చేకూరి వెంకట్రావు, కూనసాని అశోక్, అధికారి అప్పి, రావూరి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చలసానికి పాలసంఘాల కృతజ్ఞతలు



చల్లపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ పరిధిలోని 50 పాల సంఘాలకు చెందిన ఐదు వేల మంది పాడి రైతులకు రూ.1.30 కోట్ల బోనస్ విడుదల చేయడం పట్ల ఆయా సంఘాల అధ్యక్షులు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. చల్లపల్లి, యార్లగడ్డ, వక్కలగడ్డ, లక్ష్మీపురం, చింతలమడ, మేకావారిపాలెం, నూకలవారిపాలెం పాలసంఘాల అధ్యక్షులు బెల్లంకొండ లక్ష్మి, వెంకటేశ్వరరావు, నాగభూషణరావు, లక్ష్మణరావు, బోనం కృష్ణారావు, వెంకట నరసింహారావు, వీరయ్య పాల్గొన్నారు.

తోట కనకదుర్గకు ఎమ్మెల్యే మండలి సత్కారం



అవనిగడ్డ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి లో పని చేసే కార్యకర్తకు పార్టీలో సముచిత గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితురాలైన తోట కనకదుర్గను మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మత్తి వెంకటేశ్వరరావు, తుమ్మల చౌదరిబాబు, రాయపూడి వేణుగోపాలరావు, బాసు నాంచారయ్య నాయుడు, పూషడపు రత్నగోపాల్, బచ్చు వెంకటనాథ్, అన్నపరెడ్డి వెంకటస్వామి, గుడివాక శివరావు, సిద్ధినేని అశోక్ నాయుడు, బండ్రెడ్డి హరి, భోగాది విష్ణువర్ధన్, బాదర్ల లోలాక్షుడు తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణ అంశాన్ని అజెండాలో చేర్చకపోవడంపై వాడివేడిగా చర్చ

పెడన, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం 18 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైన అంశాన్ని కమిషనర్ అజెండాలో పోవడంపై పెడన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. తాము కోరినప్పటికీ అజెండాలో ఆక్రమణ అంశాన్ని ఎందుకు పెట్టలేదని వైసీపీ సభ్యులు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబులు కమిషనర్ గోపాలరావును ప్రశ్నించారు. తమ మాట వినని కమిషనర్‌పై కలెక్టర్, డీఎంఏలకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు హెచ్చరించారు. మునిసిపల్ మార్కెట్లను పాడుకున్న మునిసిపాలిటీకి సకాలంలో డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 19వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ళ జయేష్ అధికారులకు సూచించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని ఆరు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మేనేజర్ మట్టా రాజా, టిపిఒ బళ్ళ సృజనకుమారి, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి

కోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. నిరసనకు సీపీఎం, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నేతలు మద్దతు పలికారు. పాస్టర్ ప్రసాద్, ఆవుల బసవయ్య, మోహనరావు, మద్దాల బాలయ్యతోపాటు మండలంలోని వివిధ సంఘాలకు చెందిన దైవసేవకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళేశ్వరస్వామి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తన నాట్యాంజలి

ఘంటసాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళేశ్వరస్వామి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తన నాట్యాంజలి కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్, సంస్కృతి - తెలంగాణ సెక్రటరీ తాళ్లపాక గౌరి ప్రసన్న, డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాట్యగురువు అనూష నాయుడు బృందం, నాదెళ్ల ఉమాదేవి బృందం స్వామి చెంత అన్నమయ్య సంకీర్తనలు గానం చేశారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు పాల్గొన్నారు.

సుబ్బనాగన్న ఆశ్రమంలో గురుపూజ

చల్లపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బళ్ల సుబ్బనాగన్న ఆశ్రమంలో వార్షిక గురుపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జక్కుల మాళేంద్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం అన్నసమారాధన ప్రారంభించారు. ఆశ్రమ నిర్వాహకులు బళ్ల జయప్రసాద్, జక్కుల తారక బ్రహ్మం, బొందలపాటి ప్రసాద్ పర్యవేక్షించారు.